## పైవంతెన వదిలి.. ప్రమాదం వైపు కదిలి..





విజయవాడ నుంచి మచిలీపట్నం వెళ్లే జాతీయ రహదారిపై ఈడుపుగల్లు దగ్గర ఫుట్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించారు. ఆ ప్రాంతవాసులు జాతీయ రహదారిపై ఒకవైపు నుంచి మరోవైపు వెళ్లేందుకు వీలుగా పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులు కూడా దీనిపై నుంచి రాకపోకలు సాగించవచ్చు. కానీ ఈ వంతెనను వాడకుండా రహదారి మధ్యలో ఉన్న డివైడర్ పైనుంచి ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీనికోసం డివైడర్ పైకి ద్విచక్ర వాహనం ఎక్కిదిగేందుకు వీలుగా తవ్వారు. ఇలా యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నా నిలువరించేవారు లేరు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ఈడుపుగల్లులో బందర్ రోడ్డుపై కనిపించిన దృశ్యాలివి.

–ఈనాడు, అమరావతి

## 22న కృష్ణానదీ తీరాన డ్రోన్ షో

**భవానీపురం, న్యూస్‌టుడే :** కృష్ణానదీ తీరాన కనువిందు చేసేలా ఈ నెల 22న డ్రోన్ షో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏపీ మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్, కలెక్టర్ సృజన తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం భవానీపురం పున్నమిఘాట్ వద్ద అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఇతర ప్రముఖులు హాజరవుతారని వెల్లడించారు. ఏపీని డ్రోన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ షోతో పాటు లేజర్ లైట్ అండ్ సౌండ్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. జేసీ నిధిమీనా, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, డీసీపీ గౌతమి శాలి తదితరులు పాల్గొన్నారు.


# ఈనాడు అమరావతి

కృష్ణా

బుధవారం అక్టోబరు 16, 2024




## ‘ఇసుక దోచుకున్న జగన్.. కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడమా’

**మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే:** కొంతమంది అనుయాయులను పెట్టుకుని ఇసుక దోచుకున్న మాజీ సీఎం జగన్.. కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గు చేటని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. మంగళవారం ఆయన బందరు నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలతో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా ఇసుక సరఫరా చేస్తున్నామని, ఎక్కడైనా అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇప్పటి వరకు 40 వాహనాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. లేనిపోని విమర్శలు చేస్తే ప్రజలు తరిమికొడతారని మంత్రి కొల్లు హెచ్చరించారు. మద్యం దుకాణాల కేటాయింపుపై జగన్‌రెడ్డికి మాట్లాడే అర్హత లేదన్నారు. గత ఐదేళ్లు ప్రభుత్వానికి రావాల్సిన మద్యం ఆదాయాన్ని దోచుకున్నది ఎవరు? జగన్‌రెడ్డి కాదా.. ఈ విషయం ప్రజలకు తెలియదా? అంటూ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ విధానాలను, పారదర్శకతను చూసి ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా ఎప్పుడూ లేనివిధంగా 90 వేల దరఖాస్తులు రాగా వాటి ద్వారా రూ. 1798 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. ప్రభుత్వంపై నమ్మకంతోనే మహిళలు కూడా మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. మద్యం తయారీ నుంచి విక్రయాల వరకు మొత్తం వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకుని రూ. లక్షల కోట్లు జగన్‌రెడ్డి దోచుకున్నారని మంత్రి ఆరోపించారు.



కొల్లు రవీంద్ర

## ఫుల్లుగా ఆదాయం

### నేటి నుంచి మద్యం దుకాణాలు ప్రారంభం



మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

**నూ**తన ఎక్సైజ్ విధానం ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఉన్న మద్యం దుకాణాలకు లాటరీ ప్రక్రియ పూర్తయ్యింది. దుకాణాలు దక్కించుకున్న వారు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా బుధవారం నుంచే నిర్వహించాల్సి ఉంది. దీంతో మంగళవారం సాయంత్రానికి ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. దుకాణాలు ప్రారంభించేందుకు మొదటి కిస్తీ మొత్తాన్ని కూడా నిర్వాహకులు ప్రభుత్వానికి చెల్లించారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో దుకాణాలు ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టారు.

**భారీగా సొమ్ములు**

జిల్లా వ్యాప్తంగా ఉన్న 8 ఎక్సైజ్ సర్కిల్స్ పరిధిలో మొత్తం 123 దుకాణాలకు 2,942 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున వీటి ద్వారా ప్రభుత్వానికి మొత్తం రూ.58.84 కోట్లు ఆదాయం వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం దుకాణదారులు అందరూ మొదటి కిస్తీ మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించారు. రూ.55 లక్షల స్లాబ్ దుకాణానికి రూ.9,16,667, రూ.65 లక్షల దుకాణాలకు రూ.10,83,333 చొప్పున మొదటి కిస్తీగా చెల్లించాల్సి ఉంది. దుకాణాలు దక్కించుకున్నవారు 48 గంటల్లో ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంది. ఒకవేళ వారు చెల్లించకపోతే ఇబ్బందులు తలెత్తకుండా రిజర్వుగా మరో ఇద్దరిని లాటరీ ద్వారానే ఎంపిక చేశారు. అయితే వారికి అవకాశం లేకుండా నిర్దేశించిన సమయానికే దుకాణాలు దక్కించుకున్న వారందరూ మొదటి విడత కిస్తీ చెల్లించారు. రూ.65 లక్షల స్లాబ్‌కు సంబంధించి జిల్లాలో 15, రూ.55లక్షలకు చెందినవి 108 దుకాణాలు ఉన్నాయి. వాటి ద్వారా ప్రభుత్వానికి రూ.11.53 కోట్లు ఆదాయం సమకూరింది. మొదటి ఏడాది రూ.55 లక్షలు ఉన్న దుకాణానికి వచ్చే ఏడాది 10 శాతం పెంపుతో రూ.60.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అదే రూ.65 లక్షల దుకాణానికి రూ.71.50లక్షలు చెల్లించాల్సి ఉండడంతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం మొదటి ఏడాది కంటే రెండో ఏడాది గణనీయంగా పెరగనుంది.

| సర్కిల్ | షాపులు | మొదట కిస్తీ ద్వారా ఆదాయం |
|---|---|---|
| మచిలీపట్నం | 16 | 15500002 |
| బంటుమిల్లి | 07 | 6419000 |
| అవనిగడ్డ | 11 | 10083337 |
| మొవ్వ | 11 | 10083337 |
| గుడివాడ | 19 | 18583353 |
| నందివాడ | 06 | 5502000 |
| ఉయ్యూరు | 30 | 28000008 |
| గన్నవరం | 23 | 21160000 |
| మొత్తం | 123 | 11,53,31,037 |

**స్థలం కోసం వెతుకులాట**

దుకాణాలు దక్కించుకున్న వారందరూ బుధవారం నిర్దేశించుకున్న ప్రాంతాల్లో వాటిని ప్రారంభించాల్సి ఉంది. దీంతో వారంతా ఎక్కడైతే బాగుంటుందో ఆ ప్రాంతాల్లోని స్థలాల కోసం వెతుకులాట ప్రారంభించారు. దుకాణాలు పొందిన వారిలో చాలామంది లిక్కర్ వ్యాపారులు కావడంతో ముందే వారికి వివిధ ప్రాంతాల్లో స్థలాలు సిద్ధం చేసుకున్నారు. దుకాణాలు నిర్వహిస్తున్న వారిలో కూడా అనేక మందికి ఈసారి లాటరీ రాలేదు. దీంతో ప్రదేశం కోసం కొందరు వారితో సంప్రదింపులు చేశారు. జిల్లా వ్యాప్తంగా 123 ప్రభుత్వ మద్యం దుకాణాలు రద్దు చేయడంతో పలువురు ఆ దుకాణాలు నిర్వహించే ప్రదేశాలనే ఎంపిక చేసుకోవడానికి మొగ్గు చూపారు. మద్యం తాగేవారు ఆ ప్రదేశాలకు అలవాటు పడి ఉంటారని, కొందరు వ్యాపారులు ఆ స్థల యజమానులతో మాట్లాడి అక్కడే సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా మేజర్ పంచాయతీల్లో వాటి ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారు.

**వాటా తీసుకుందామా.. కొందామా..**

లిక్కర్ వ్యాపారంలో ఆరితేరిన పలువురు ఈసారి దుకాణాలు దక్కకపోవడంతో ఎలాగైనా వ్యాపారం చేయాలని ఆలోచిస్తున్నారు. ఇప్పటికే సిండికేట్‌లతో మాట్లాడి తమకు కూడా వాటా ఇవ్వాలని అడుగుతుంటే.. మరికొందరు దుకాణాలు పొందినవారు ఎవరైనా విక్రయిస్తారేమోనని ఎదురు చూస్తున్నారు. అలా దుకాణాలు విక్రయించేందుకు కూడా పలువురు స్థానికేతరులు సిద్ధంగా ఉండడంతో వారితో సంప్రదింపులు చేస్తున్నారు. మచిలీపట్నంలో దుకాణం పొందిన ఇతర ప్రాంతాల వ్యక్తులతో ఇప్పటికే పలువురు బేరసారాలు ఆడుతున్నారు. పోటీ ఉండడంతో విక్రయించేవారు కూడా ధరలు పెంచి చెబుతున్నారు. మచిలీపట్నంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఇలా పలువురు వాటా తీసుకోవాలా? లేక కొందరితో కలిసి దుకాణమే కొనాలా? అనే యోచనలో ఉన్నారు.

## అధికారుల నిర్లక్ష్య ధోరణి సహించేది లేదు

**భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే:** నూరు రోజుల జిల్లా ప్రణాళిక అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న జిల్లా అధికారులపై కలెక్టర్ డి.కె.బాలాజీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశ మందిరంలో నూరు రోజుల జిల్లా ప్రణాళికపై వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ జిల్లాకు కొత్తగా వచ్చిన చాలామంది జిల్లా అధికారులు సమావేశాలను తేలికగా తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన సమాచారం లేకుండా సమావేశాలకు రావడం సరైంది కాదని చురకలు వేశారు. ముఖ్యమంత్రి కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించి రెండు నెలలు అయ్యిందని, అప్పటి నుంచి జిల్లాలో 100 రోజుల్లో చేయాల్సిన వివిధ పనుల గురించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ఆ ప్రణాళిక ప్రకారం ఏమేరకు ప్రగతి సాధించారో పరిశీలిస్తే కేవలం రెండు, మూడు శాఖలు తప్ప.. మిగిలిన దాదాపు అన్ని శాఖల అధికారులు సరిగా పట్టించుకోలేదన్నారు. జిల్లా అధికారుల వాట్సప్ గ్రూప్‌లో సూచనలు ఇచ్చినప్పటికి చాలామంది అధికారులు వాటిని చూడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులు మంజూరైనందున తాగునీరు, విద్యుత్తు సౌకర్యం వారంలోగా కల్పించాలన్నారు. జిల్లా అధికారులు తన అనుమతితో సెలవులో వెళ్తే వారి తరఫున తదుపరి స్థాయిలో ఉన్న అధికారులు సరైన సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని స్పష్టం చేశారు. రహదారుల మరమ్మతుల కోసం పిలిచిన టెండర్లు ఖరారయ్యాక సంబంధిత కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. డ్వామా ద్వారా చేపట్టిన పనుల వివరాలను పీడీ శివప్రసాద్ వివరించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ రమణరావు, సీపీవో గణేష్, విద్యుత్తు శాఖ ఎస్ఈ సత్యానందం, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి, ఆర్అండ్‌బి అధికారి లోకేశ్, మార్క్‌ఫెడ్ ఏడీ మురళీకృష్ణ, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ బాలాజీ

## బీడీఎస్ యాజమాన్య సీట్లకు ఆప్షన్లు

**ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే:** ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని దంత వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న బీడీఎస్ యాజమాన్య కోటా సీట్ల ప్రవేశానికి అభ్యర్థులు ఆప్షన్లు ఇచ్చుకోవాలని విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మంగళవారం ప్రకటన జారీ చేసింది. ఈ నెల 15వ తేదీ రాత్రి 9 గంటల నుంచి 17వ తేదీ రాత్రి 9 గంటల వరకు ఆప్షన్లు పెట్టుకోడానికి అవకాశం కల్పించారు. ఇప్పటికే విశ్వవిద్యాలయం ప్రాధాన్య క్రమాన్ని విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 14 ప్రైవేటు దంత కళాశాలల్లో ‘బి1’ కేటగిరీలో 64, ‘బి2’ కేటగిరీలో 390, ‘సి’ కేటగిరీలో (ఎన్నారై కోటా) 196 సీట్లు అందుబాటులో ఉన్నాయి. విజయవాడ సమీపంలోని నిమ్రా మైనార్టీ దంత కళాశాలలో ‘బి’ కేటగిరీలో 35, ‘సి’ కేటగిరీలో 15 సీట్లున్నాయి.

### ఎంబీబీఎస్ క్రీడా కేటగిరీ సీట్ల కేటాయింపు

రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ క్రీడా విభాగం సీట్లను మంగళవారం విశ్వవిద్యాలయం కేటాయించింది. మొత్తం 19 సీట్లను క్రీడా విభాగానికి కేటాయించారు. ఇంకా ఎన్‌సీసీ విభాగం ప్రాధాన్య క్రమం విడుదల కాలేదు. దాని కోసం తల్లిదండ్రులు, అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

## జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్

### ఎన్టీఆర్ జిల్లాకు సత్యకుమార్

ఈనాడు, అమరావతి

**జి**ల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రులను ప్రభుత్వం నియమించడంతో అభివృద్ధిపై సమీక్షలకు అవకాశం ఏర్పడింది. ఉమ్మడి కృష్ణా జిల్లాకు ఇద్దరు యువ మంత్రుల నియామకంతో ప్రజా ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్యవిద్యాశాఖ మంత్రి వై.సత్యకుమార్‌ను నియమించారు. కృష్ణా జిల్లాకు కార్మిక సంక్షేమశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను నియమించారు. ఇద్దరూ తొలిసారి చట్ట సభలకు ఎన్నికై మంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. ఇన్‌ఛార్జి మంత్రికి కేటాయించే ప్రత్యేక నిధుల ద్వారా జిల్లాలో అభివృద్ధి పథకాలు చేపట్టే అవకాశం ఉంది.



సుభాష్

**అభివృద్ధి ప్రణాళికలకు రూపకల్పన**

కృష్ణా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా వాసంశెట్టి సుభాష్‌ను నియమించారు. ఆయన కార్మిక సంక్షేమం, ఫ్యాక్టరీలు, బాయిలర్లు, బీమా వైద్య సేవల మంత్రిగా వ్యవహరిస్తున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రామచంద్రాపురం నియోజకవర్గం నుంచి ఆయన తెదేపా తరఫున విజయం సాధించారు. అంతకుముందు సుభాష్ వైకాపాలో కొనసాగేవారు. 2024 జనవరిలో చంద్రబాబు సమక్షంలో తెదేపాలో చేరారు. వైకాపా యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. అమలాపురం అల్లర్ల వ్యవహారంలో పార్టీతో విభేదించి తెదేపాలో చేరారు. ఆయనకు కృష్ణా జిల్లా బాధ్యతలు అప్పగించారు. కృష్ణా జిల్లాకు చెందిన గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్రను అనకాపల్లి జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా నియమించారు. వీరి ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించనున్నారు. ఎన్టీఆర్, కృష్ణా రెండు జిల్లాలు కీలకంగా మారనున్నాయి.

**ధర్మవరం నుంచి తొలిసారి..**

ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వై.సత్యకుమార్ యాదవ్.. అనంతపురకం జిల్లా ధర్మవరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా తొలిసారి ఎన్నికయ్యారు. ఎన్డీఏ మిత్ర పక్షం భాజపా నుంచి ఆయన గెలుపొంది... మంత్రి వర్గంలో స్థానం సంపాదించారు. భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన ఉన్నత విద్యను అభ్యసించారు. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు వద్ద 1993 నుంచి వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసేవారు. ఉపరాష్ట్రపతి వద్ద ఓఎస్‌డీగా కొంత కాలం పనిచేశారు. పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్, అండమాన్ నికోబార్ రాష్ట్రాలకు పార్టీ ఇంఛార్జిగా పనిచేశారు. 2024 ఎన్నికల్లో తొలిసారి ఎన్డీఏ అభ్యర్థిగా ధర్మవరం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. వైద్యారోగ్య శాఖ మంత్రిగా నిత్యం తనిఖీలు చేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు.



సత్యకుమార్



## మాకేదీ పరిహారం..!

- ఇప్పటికే బాధితులకు రూ.286.46 కోట్లు జమ
- ఇంకా కుప్పలుతెప్పలుగా అందుతున్న దరఖాస్తులు



ఈనాడు, అమరావతి

**బు**డమేరు వరద ముంచెత్తిన ఇళ్లకు పరిహారం అందించడం ప్రహసనంగా మారింది. ఇప్పటికే దాదాపు రూ.188.80 కోట్ల పరిహారం పంపిణీ చేయగా ఇంకా అందలేదని అధికారుల చుట్టూ తిరిగేవారు ఎక్కువగా ఉన్నారు. బుడమేరు వరదలకు, వర్షాలకు దాదాపు రూ.286.46 కోట్ల పరిహారం ప్రభుత్వం అందించింది. ఇది ఓ రికార్డుగా అధికారులు చెబుతున్నారు. ఇళ్లలో బురద ఆరకముందే పరిహారం ఖాతాలో జమ అయ్యాయి. ఇటీవల వివిధ కారణాలతో బ్యాంకులో జమ కాని ఖాతాలకు 7,164 మందికి పరిహారం అందేలా చర్యలు తీసుకున్నారు. అయినా కుప్పలు తెప్పలుగా అర్జీలు వస్తున్నాయి.

**అధికారుల విస్మయం..**

రీఎన్యూమరేషన్ జరగాలనే డిమాండ్ లేవనెత్తుతున్నారు. ఇన్ని రోజుల తర్వాత రీఎన్యూమరేషన్ డిమాండ్ రావడంపై అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మూడుసార్లు ఎన్యూమరేషన్ ప్రక్రియ జరిగింది. నిబంధనలను అనుసరించి జీవో ప్రకారం అర్హుల గుర్తింపు సచివాలయాల పరిధిలో సిబ్బంది ఆధ్వర్యంలో జరిగాయి. దీనిపై మరోసారి రీవెరిఫికేషన్ పేరుతో ఇతర ప్రాంతాల తహసీల్దారు ఆధ్వర్యంలో జరిగాయి. ప్రస్తుతం కలెక్టరేట్‌లో మరో 21వేల దరఖాస్తులు పరిశీలనకు వచ్చాయి. ముంపు ప్రాంతంలో నివాసం ఉంటున్నట్లు ఏమాత్రం ధ్రువీకరణ లేని దరఖాస్తులే ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది.

**బుడమేరు వరదలకు అందించిన పరిహారం..**

| | లబ్ధిదారులు | సొమ్ము (రూ.కోట్లలో) |
|---|---|---|
| మునిగిన ఇళ్లు | 89,616 | 188.8050 |
| ఎంఎస్ఎంఈ | 6130 | 18.9375 |
| వాహనాలు | 42,742 | 16.6212 |
| వ్యవసాయ రంగం | 32,983 | 55.6006 |
| పశువులు | 196 | 1.4636 |
| మత్స్యశాఖ | 481 | 0.7835 |
| చేనేత | 02 | 0.0050 |
| ఉద్యానవనం | 2321 | 4.2435 |
| మొత్తం | 1,74,471 | 286.4601 |

**ఇదీ జరిగింది..**

- ఆగస్టు 30, 31 తేదీల్లో కురిసిన వర్షాలకు బుడమేరు వరద ఆకస్మికంగా పొంగి విజయవాడ నగరాన్ని ముంచెత్తిన విషయం తెలిసిందే. దాదాపు 10 రోజుల పాటు అధికార యంత్రాంగం కృషి చేసి వరద నుంచి నగరాన్ని గట్టెక్కించారు. విజయవాడ సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలో 179 సచివాలయాలపై ప్రభావం చూపింది.
- విజయవాడ గ్రామీణ మండలంలోని పలు గ్రామాలతో పాటు ఈ ప్రాంతంలోని ఇళ్లను ముంచెత్తాయి. పూర్తిగా మునిగిన గ్రౌండ్ ఫ్లోర్‌కు రూ.25వేలు, మొదటి అంతస్తుకు రూ.10వేల పరిహారం సీఎం ప్రకటించి అమలు పరిచారు. ఇప్పటికే 89,616 మందికి ఇవ్వగా ఇంకా తమ ప్రాంతంలో ఇవ్వలేదని దరఖాస్తులు అందుతున్నాయి. తమ ఇళ్లకు ఎన్యూమరేషన్ కోసం బృందాలు రాలేదని కొంతమంది ధర్నా చేసిన విషయం తెలిసిందే.
- నిబంధనల ప్రకారం ఒక్క రోజు మాత్రమే ముంపులో ఉంటే పరిహారం రాదని ప్రభుత్వం స్పష్టంగా జీవోలో పేర్కొంది. అలాంటి డివిజన్లలో ఎన్యూమరేషన్ జరగలేదు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లు నీట మునగలేదు. కానీ మునిగినట్లు కొంతమంది దరఖాస్తులు ఇస్తున్నారు. వీటిని అధికారులు నిగ్గు తేల్చుతున్నా పరిహారం రాలేదని అర్జీలు అందిస్తున్నారు.
- ఒక ఇంటిలో ఒక కుటుంబానికి మాత్రమే పరిహారం ఇస్తున్నారు. అయితే ఒకే పోర్షన్‌లో మూడు కుటుంబాలు ఉంటున్నట్లు అర్జీలు ఇస్తున్నారు. తాము వేర్వేరు అంటూ దరఖాస్తులు చేస్తున్నారు. వీటిపై విచారణ జరిపి ధ్రువీకరిస్తున్నా మళ్లీ అర్జీలు అందుతూనే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇలాంటి దరఖాస్తులు కలెక్టరేట్‌కు 21వేల వరకు అందాయి.

**దళారుల ప్రమేయం..**

నీట మునిగిన ప్రాంతంలో ఇళ్లలో నివాసం ఉంటున్నట్లు ధ్రువీకరణ చూపించాల్సి ఉంది. దీనికి రేషన్ కార్డు మ్యాపింగ్, విద్యుత్తు బిల్లు, రెంటల్ స్లిప్, ఇతర ఆధారాలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎలాంటి ఆధారాలు లేకుండా ఎక్కడికెక్కడి నుంచో వచ్చినవారు అర్జీలు ఇస్తున్నారని తెలిసింది. కొంత మంది దళారులు ప్రవేశించి తాము పరిహారం ఇప్పిస్తామంటూ మోసం చేస్తున్నారు. పూర్తిగా మునిగిన ఇంటికి రూ.25వేలు, మొదటిఫ్లోర్‌కు 10వేలతో పాటు వాహనాలు, తోపుడు బండ్లకు పరిహారం ఇస్తున్న విషయం తెలిసిందే. దీన్ని దక్కించుకునేందుకు అధికంగా బోగస్ దరఖాస్తులు వస్తున్నాయి.

**ఆధారాలు లేకపోతే తీసుకోం..**

ఎలాంటి ఆధారాలు లేనివాటిని పరిగణనలోకి తీసుకోం. పెండింగ్‌లో పడిన ఖాతాలకు సొమ్ము జమ చేశాం. ఇంకా మరో 3వేల వరకు ఉండే అవకాశం ఉంది. మిగలిన దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలన చేయాల్సి ఉంది. దళారులను నమ్మి మోసపోవద్దు.

**- సృజన, కలెక్టర్**

## గుడివాడలో అవినీతి తిమింగలాలు

- గత ఐదేళ్లలో రూ.55 కోట్ల ప్రజాధనం స్వాహా
- పనులు చేయకుండానే వైకాపా నాయకులు, గుత్తేదారులు మింగేశారు

న్యూస్‌టుడే, గుడివాడ పట్టణం

**గు**డివాడ పురపాలక సంఘం నిధులను గత వైకాపా పాలనలో ఆ పార్టీ నాయకులు, గుత్తేదారులు రూ.కోట్లలో బొక్కేశారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి పైపులైన్లు, తదితర నిర్మాణ పనుల పేరుతో ఏడాదికి రూ.11 కోట్లు చొప్పున అయిదేళ్లలో సుమారు రూ.55 కోట్ల సాధారణ నిధులు అక్రమంగా దోచుకున్నారు. గతంలో ఇక్కడ సహాయ కమిషనర్‌గా పనిచేసిన రంగారావుకు ముగ్గురు గుత్తేదారులు సన్నిహితులు కావడం వల్లే వారు ఆడింది ఆట పాడింది పాటగా సాగింది. ట్రాక్టర్ల మరమ్మతుల పేరుతో, ఆయిల్, వాహనాల బిల్లులకు నెలకు దాదాపు రూ.20 లక్షల వరకు బిల్లులు చేసుకున్నారు.

★ తాగునీరు అందని ప్రాంతాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరాకు ఓ గుత్తేదారు 50 శాతం తక్కువకు టెండరు వేశారు. నీరు సరఫరా చేయకుండానే అధికారులకు లంచాలు ముట్టజెప్పి మొత్తం ప్రజాధనం కొల్లగొట్టేశారు.



నిర్మాణం పూర్తికాని పుల్లలపాడు శ్మశానవాటిక

★ వివిధ పనులకు ఆ ముగ్గురు గుత్తేదారులకు ఒక రేటు.. మిగిలిన వారికి మరో రేటు అధికారులు చెల్లిస్తున్నారు. ఉదాహరణకు జేసీబీ వినియోగానికి గంటకు ఇతరులకు రూ.1200 ఇస్తుంటే ఆ ముగ్గురికి మాత్రం రూ.3 వేలు చెల్లిస్తున్నారు. ఈ వ్యవహారంలో భారీ మొత్తంలో ప్రజాధనం పక్కదారి పడుతోంది.

**నిర్మించకుండానే బిల్లులు చేసుకుని..**

కరోనా సమయంలో పట్టణ శివారు పుల్లలపాడులో విద్యుత్తు శ్మశాన వాటిక నిర్మాణం పూర్తి కాకుండానే నిర్మించినట్లు ఓ గుత్తేదారు రూ.74.5 లక్షలకు బిల్లులు చేయించుకున్నారు. ఈ నిర్మాణంలో తొలుత సాధారణ ఇటుకలు వాడి తరువాత సిమెంటువి వినియోగించారు. భవనం ఇంకా పూర్తికాకపోగా విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు చేయకుండానే బిల్లులు చెల్లించినట్లు సెంట్రల్ ఆడిట్‌వారి పరిశీలనలో తేలింది.

**ఫిర్యాదులు చేయించి.. లేని పనులకు బిల్లులు**

ఒక గుత్తేదారు తన ట్యాంకరుతో ఓ ప్రాంతంలో నీరు పారబోసి కుళాయిలు లీకవుతున్నాయని ఫిర్యాదు చేయించి లేని పనికి భారీగా నిధులు దోచేశారు. గత ఐదేళ్లలో రూ.కోట్లలో అక్రమార్జనకు తెగబడ్డారు. ఆయన భార్య పురపాలక సంఘం ఇంజినీరు కావడం గమనార్హం. ★ మరో గుత్తేదారు రాత్రి పూట చెత్త తెచ్చి పలు వీధుల్లో పోయించి స్థానికులతో ఫిర్యాదు చేయిస్తారు. జేసీబీ వినియోగించినట్లు నెలకు రూ.10 లక్షల వరకు దోచేశారనే ఆరోపణలు ఉన్నాయి. ★ పట్టణంలోని చాచా నెహ్రూ, ఏజీకే పాఠశాలలు, తుమ్మల రామబ్రహ్మం పార్కులో ఆటల పరికరాలు, వ్యాయామ సామగ్రి, ఇనుప తలుపులు, కిటికీలను పురపాలక సంఘ డీఈ పేరు చెప్పి వైకాపాలోని మైనారిటీ నాయకుడు పాత ఇనుము కింద అమ్మి రూ.లక్షల్లో కాజేశారు.

**నైట్ షెల్టర్ పేరుతో..**

మందపాడులో వీధి బాలలు, యాచకులు, వృద్ధులు రాత్రి నివాసం ఉండడానికి రూ.47.5 లక్షలతో నైట్ షెల్టర్ నిర్మిస్తున్నారు. ఈ పనులు 30 శాతమూ పూర్తి కాకుండానే రూ.30 లక్షలకు బిల్లులు చేశారని తెలుస్తోంది. ఈ నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలివ్వడంతో గోడలు బీటలు వారాయి. దీనిపైనా సెంట్రల్ ఆడిట్ బృందం అభ్యంతరాలు తెలిపినట్లు తెలిసింది.

**200 దస్త్రాలు మాయం**

సెంట్రల్ అడిట్ అధికారుల బృందం ఇటీవల పరిశీలనకు రాగా పురపాలక సంఘంలో వివిధ పనులకు సంబంధించి సుమారు 200 దస్త్రాలను అక్రమార్కులు మాయం చేశారు. ఇందులో అధికారుల భాగస్వామ్యం కూడా ఉందని.. విజిలెన్స్ విచారణ చేయించి నిగ్గు తేల్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు అధికారులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. కొత్త అధికారులు చేరుతూ ఆ దస్త్రాల గురించి తమకు తెలీదని దాటవేస్తున్నారు. గత అయిదేళ్ల వైకాపా పాలనలో నిధుల కేటాయింపు, పనుల తీరుపై విచారణ చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

# సృజన అబ్బురం!

## ఆకట్టుకున్న విద్యార్థుల ప్రయోగాలు
## వీఆర్ సిద్ధార్థ కళాశాలలో సైన్స్ ఎక్స్‌పో

ఈనాడు డిజిటల్, అమరావతి

అందరి లక్ష్యం ఒక్కటే.. ప్రజలకు మెరుగైన, సులువైన సేవలు అందించడం. సమాజానికి ప్రయోజనం చేకూర్చడం. కొత్త పద్ధతిలో ప్రయోగాలు చేయడం. తక్కువ ఖర్చుతోనే అవసరాలు తీర్చుకోవడం. ఇలాంటి ఎన్నో వినూత్న ప్రయోగాలకు వేదికగా నిలిచింది.. కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఇక్కడ సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులు తమ సృజనతో ఆకట్టుకున్నారు. సందర్శకులను ఆలోచింపజేశారు.


ప్రయోగాలు వివరిస్తున్న విద్యార్థులు

### తక్కువ ఖర్చుతో ఇళ్ల నిర్మాణం



3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ద్వారా తక్కువ ఖర్చుతో ఇల్లు నిర్మించుకోవచ్చు. 3డీ కాంక్రీట్ దిమ్మెలను సిమెంట్, ఇసుక, దూళి, బూడిదతో తయారు చేస్తాం. కార్మికుల శక్తి తక్కువ అవసరం అవుతుంది. పునాది దశలో తప్ప.. మిగిలిన ఇంటి నిర్మాణంలో అంతగా ఇనుము వినియోగించాల్సిన అవసరం ఉండదు. సాధారణంగా ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చులో 40శాతం సొమ్ముతో 3డీ ఇంటిని నిర్మిస్తున్నాం. ఈ పద్ధతిలో వీఆర్ సిద్ధార్థ కళాశాలలో నిర్మాణం చేపడుతున్నాం.

– వర్షిని, వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల

### అత్యవసర విభాగాల్లో డ్రోన్ సేవలు



ప్రస్తుతం డ్రోన్ల వినియోగం వివిధ రీతుల్లో పెరిగింది. కానీ.. కీలక రంగాలైన ఆరోగ్య, రక్షణ, నిఘా, ట్రాఫిక్, విపత్తు నిర్వహణల్లో వాటి వినియోగం లేదు. ఆయా రంగాల్లో క్లిష్టమైన పనులను సులువుగా చేసేలా.. స్వదేశీ పరిజ్ఞానంతో డ్రోన్లను తయారు చేశాం. వరదలు వచ్చినప్పుడు ముంపులో ఉన్న ప్రజలను గుర్తించవచ్చు. వారికి ఆహారం, మంచినీరు అందించవచ్చు. ట్రాఫిక్ సమస్యలు తొలగించవచ్చు.

– రాజేశ్వరి, ప్రవీణ్ కుమార్, ఇంజినీరింగ్ రెండో ఏడాది, ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల

### రూ.29 వేలకే ఈ-సైకిల్



నగరాల్లో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. సైకిల్‌కు ఎలక్ట్రికల్ బ్యాటరీ అమర్చి, ఈ-సైకిల్‌గా మార్చాం. దీని ద్వారా గాలి కాలుష్యం ఏర్పడదు. 3 గంటల విద్యుత్తు ఛార్జింగ్‌తో 40 కి.మీ ప్రయాణించవచ్చు. అర యూనిట్ మాత్రమే ఖర్చవుతుంది. పెట్రోల్ కంటే తక్కువ ఖర్చుతో ప్రయాణించవచ్చు. దీనిని తయారు చేయడానికి రూ.29 వేలు అయ్యింది. పోర్టబుల్ బ్యాటరీ సిస్టమ్ గల సైకిల్‌ను తయారు చేయడానికి ప్రయోగాలు చేస్తున్నాం.

– అవినాష్, కృష్ణ, వీఆర్ సిద్ధార్థ

### చెరువుల వద్దే.. రొయ్యల నాణ్యత



ఒక రొయ్యల చెరువు వద్ద సుమారు 25 మంది పనిచేస్తుంటారు. పెంపకం దగ్గర నుంచి అమ్మకాల వరకు వాటి బాగోగులు చూసుకుంటారు. విక్రయాల సమయాల్లో.. వాటి నాణ్యతను నిర్ధారించుకోవడానికి చాలా మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వారు చెప్పే ధరకే విక్రయించి నష్టపోతున్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో 'సామ్రాస్' అనే యంత్రాన్ని తయారు చేశాం. చెరువు వద్దే రొయ్యల నాణ్యత తెలుసుకోవచ్చు. మార్కెట్ ధరకే విక్రయాలు చేయవచ్చు. ఈ ప్రయోగాన్ని జాతీయ స్థాయి సైన్సు పోటీల్లోనూ ప్రదర్శించి బహుమతులు గెలుచుకున్నాం.

– హనీష్, యాసన్, వీఆర్ సిద్ధార్థ

# జాతీయ రహదారంటే నమ్మాలి మరి!

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే:

చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి వెంబడి గన్నవరం నియోజకవర్గ పరిధిలో ఉన్న సర్వీసు రోడ్డు అత్యంత హీనంగా తయారయ్యాయి. జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించిన క్రమంలో ఇరువైపులా ఉన్న గ్రామాలను ప్రధాన మార్గంతో అనుసంధానిస్తూ సర్వీసు రోడ్లు నిర్మించారు. ఇవి అందుబాటులోకి వచ్చి దాదాపు రెండేళ్లు దాటింది. కానీ సరైన పర్యవేక్షణ, నిర్వహణ లేకపోవడంతో ఎవరికి కావాల్సిన విధంగా వారు తమ సొంత స్థలం మాదిరిగా పలు చోట్ల వీటిని వాడుకుంటున్నారు. వీరవల్లి వంటి చోట ఏకంగా అనధికార చెత్త నిల్వ కేంద్రంగా మార్చేశారు. ఇక్కడే పశువుల పేడ, ఇతర వ్యర్థాలను నేరుగా రోడ్డు మీదకే వదిలేస్తున్నారు. కోడూరుపాడు, పొట్టిపాడు, పెద్దఅవుటపల్లి, ఆత్కూరు వంటి గ్రామాల్లో బడ్డీలు, చిన్నపాటి దుకాణాలు ఏర్పాటు చేసేశారు. ఎన్‌హెచ్‌ఏఐ పెట్రోలింగ్ సిబ్బంది సర్వీసు రోడ్లు తమ పరిధిలోకి రావన్నట్లుగా వ్యవహరిస్తుండడంతో శాశ్వత ఆక్రమణలు సైతం చోటుచేసుకుంటున్నాయి. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ వీటిని శుభ్రపర్చడంతో పాటు, రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.


రోడ్డుపై వ్యర్థాలు


వాడేసిన కొబ్బరి బొండాలకు ఇదే స్థావరం

# క్షిపణి పరీక్ష కేంద్రం.. దివిసీమకు మణిహారం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: గుల్లలమోద క్షిపణి పరీక్ష కేంద్రం దివిసీమకు మణిహారమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నాగాయలంక మండలం గుల్లలమోదలో క్షిపణి పరీక్షా కేంద్రం ఏర్పాటుకు ఆమోదం తెలిపిన సందర్భంగా రక్షణ శాఖ సలహాదారు జి.సతీష్‌రెడ్డిని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విజయవాడలో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ సారథ్యంలోని ఉన్నత స్థాయి భద్రతా కమిటీ నిర్ణయం మేరకు క్షిపణి పరీక్ష కేంద్రాన్ని మంజూరు చేయడం ద్వారా అవనిగడ్డ నియోజకవర్గానికి మహత్తర ప్రాజెక్టు ఇచ్చిందన్నారు. రాకెట్ ప్రయోగాలకు గుల్లలమోద అనువైన ప్రాంతంగా శాటిలైట్ ద్వారా గుర్తించిన కేంద్రం గుల్లలమోదలో క్షిపణి పరీక్ష కేంద్రం ఏర్పాటుకు ఎంపిక చేస్తే గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం సహకారం లేక ముందుకు సాగలేదన్నారు. ఈ దశలో డాక్టర్ సతీష్‌రెడ్డి దీని సాధన కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. పర్యావరణ అనుమతుల కోసం విశేషకృషి చేశారని ప్రశంసించారు. నియోజకవర్గంలో రూ.20 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్ల నిధులొచ్చే ప్రాజెక్టు మంజూరు చేసిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈకేంద్రం ఏర్పాటుతో అవనిగడ్డ నియోజకవర్గంతో పాటు, జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. దీని ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయన్నారు.


సతీష్‌రెడ్డిని సత్కరిస్తున్న బుద్ధప్రసాద్

# న్యాయసేవల శిబిరం విజయవంతం చేయాలి

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: ఈ నెల 19న మొవ్వలో నిర్వహించనున్న కొత్త తరహా న్యాయసేవా శిబిరాన్ని ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి కేవీ ఆర్ కృష్ణయ్య అన్నారు. నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న న్యాయసేవా సదన్‌లో న్యాయసేవా శిబిరం ఏర్పాట్లపై మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న ఉదయం 10 గంటలకు మొవ్వలోని మండవ జానకిరామయ్య, సులోచన క్షేత్రయ్య కల్యాణ మండపంలో శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, అందిస్తున్న సేవలపై ప్రదర్శనశాలలు ఏర్పాటు చేయడంతోపాటు కరపత్రాలు అందించాలన్నారు. ఆయా పథకాలను అర్హులు అందరూ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు ఉచిత న్యాయసహాయం, సలహాలు అందించేందుకు జాతీయ న్యాయసేవాధికార సంస్థ.. టోల్‌ఫ్రీ నంబరు 15100 అందుబాటులోకి తెచ్చిందని, దీనిని ఎక్కువ మంది వినియోగించుకునేలా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించాలన్నారు. ప్రజలకు అందుబాటులో న్యాయసేవలు అందించేందుకు ప్రత్యేకంగా యాప్‌ను కూడా అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. జిల్లా రెవెన్యూఅధికారి కె. చంద్రశేఖరరావు న్యాయసేవల శిబిరం నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్ల ఆయా విభాగాల అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు.


మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీఆర్ కృష్ణయ్య, పక్కన డీఆర్వో చంద్రశేఖరరావు

# పీఎం సూర్యఘర్ పథకంలో వేగాన్ని పెంచండి: కలెక్టర్

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే: పీఎం సూర్యఘర్ పథకంలో లక్ష్యాలను సాధించేందుకు వేగాన్ని పెంచాలని కలెక్టర్ డి.కె.బాలాజీ విద్యుత్తు ఉద్యోగులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ ఈ పథకం పురోగతిపై జిల్లాలోని విద్యుత్తు ఉద్యోగులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ ఈ పథకం పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే మంచి కార్యక్రమమన్నారు. విద్యుత్ అధికారులు మాట్లాడుతూ జిల్లాలో 1200మంది వినియోగదారులు పీఎం సూర్యఘర్‌లో నమోదు చేసుకోగా కేవలం 142మంది వినియోగదారులకు మాత్రమే గ్రిడ్‌తో అనుసంధానం చేయడం జరిగిందని తెలిపారు. అందులో 102మంది వినియోగదారులకు సబ్సిడీ అందచేయడం జరిగిందన్నారు. ఇక నుంచి రెండు, మూడు రోజులకు ఒకసారి ఈ పథకం గురించి సమీక్ష చేస్తానని, ఎవరిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. టెలీ కాన్ఫరెన్స్‌లో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నోడల్ అధికారి భాస్కర్‌రావు, జిల్లా ఎస్‌ఈ సత్యానందం, మచిలీపట్నం ఈఈ శ్రీనివాసరావు, డీఈలు, విద్యుత్ సహాయకులు పాల్గొన్నారు.

# సాదియా అల్మాస్‌కు ఘన స్వాగతం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: సౌత్ ఆఫ్రికాలో జరిగిన కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన షేక్ సాదియా అల్మాస్ నాలుగు బంగారు పతకాలు సాధించింది. హైదరాబాద్ మీదుగా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న షేక్ సాదియా అల్మాస్‌కు పలువురు క్రీడాభిమానులు, కుటుంబ సభ్యులు, పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఘన స్వాగతం పలికారు. జూనియర్ 57 కిలోల విభాగంతో పాటు ఓవరాల్‌గా నాలుగు బంగారు పతకాలను సాదియాఅల్మాస్ సాధించినట్లు కోచ్ షేక్ సంధాని తెలిపారు. పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సకల కోటేశ్వరరావు, గంటా వెంకటేశ్వరరావు, సీహెచ్ శేషుబాబు, ఆర్‌ఎన్ వంశీకృష్ణ, జి. వెంకటేశ్వరరావు, కొమ్మాకుల విజయభాస్కర్ తదితరులు అల్మాస్‌ను ప్రత్యేకంగా శాలువాతో సత్కరించారు. బంగారు పతకం రావడం తనకు ఎంతో సంతోషంగా ఉందని తనకు సహకరించిన మంత్రి నారా లోకేశ్, అసోసియేషన్ ప్రతినిధులు, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపిన అల్మాస్.. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధిస్తానని పేర్కొన్నారు.



క్రీడాకారిణి షేక్ సాదియా అల్మాస్‌కు స్వాగతం పలుకుతున్న క్రీడాభిమానులు, కుటుంబ సభ్యులు

### బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

### నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

# కాలువలో దూకి ఆటోడ్రైవర్ ఆత్మహత్య

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: పోలవరం కుడి కాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గన్నవరం మండలం వీరపనేనిగూడెంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ కరీముల్లా(40) ఆటో డ్రైవర్ కాగా.. 20 ఏళ్ల కిందట ఏలూరుకు చెందిన జుబేదాతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కరీముల్లా మద్యానికి బానిసవడంతో జుబేదా తన ఇద్దరు కుమారులను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోవడంతో అతడు ప్రస్తుతం తల్లితో కలిసి స్థానికంగా నివసిస్తున్నాడు. గత రాత్రి మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన కరీముల్లా స్థానిక పోలవరం కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం మృతదేహం లభ్యమవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆత్కూరు ఎస్సై సురేష్ మంగళవారం తెలిపారు.


షేక్ కరీముల్లా (పాత చిత్రం)

# చోరీ కేసులో ఏడాది జైలు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఓ రైతు అప్పు తీరుద్దామని బ్యాంకు నుంచి నగదు డ్రా చేసి ఇంటికి తిరిగి వస్తుండగా ఆ సొమ్ము చోరీ చేసిన నిందితుడికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధిస్తూ గన్నవరం 8వ అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు మంగళవారం తీర్పు ఇచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. గన్నవరం మండలం గోపవరపుగూడెంకు చెందిన మండవ వెంకటసుబ్బారావు వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. 02.09.2021న తనకున్న అప్పు తీరుద్దామని విశాఖకు చెందిన ఓ మిత్రుడి వద్ద రూ.3 లక్షల నగదు అడగగా అతడు వెంకటసుబ్బారావు బ్యాంకు ఖాతాలో జమ చేశాడు. ఆ సొమ్ము డ్రా చేద్దామని వెంకటసుబ్బారావు గన్నవరం బ్యాంకుకు వెళ్లి డ్రా చేసి అనంతరం నగదును ద్విచక్ర వాహనానికి పక్కన ఉన్న పెట్టెలో భద్రపరిచి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో ఓ ఎరువుల దుకాణం వద్ద కాసేపు ఆగి పని అయిన వెంటనే ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో గ్రామ శివారుకు చేరుకొనే సమయానికి నగదు భద్రపర్చిన పెట్టె తెరచి శబ్దం చేయడం గమనించిన సుబ్బారావు.. ఒక్కసారిగా అప్రమత్తమై చూసుకున్నాడు. బైక్‌లో నగదు కనిపించకలేదు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన స్థానిక పోలీసులు.. నిందితుడు విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన మేకల తిరుపతిగా గుర్తించారు. ముద్దాయిని పోలీసులు.. న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా నేరం నిరూపణ కావడంతో ఏడాది కఠిన కారాగారం, రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించకపోతే మరో 2 నెలలు అదనంగా జైలు అనుభవించాల్సి ఉంటుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. పోలీసులు సాక్షులను ప్రవేశపెట్టగా.. ఏపీపీ టి.మాధవి వాదనలు వినిపించారు.

# ఏలూరు కాల్వలో పడి వృద్ధురాలి మృతి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు మండలం పెరికీడు వద్ద ఓ వృద్ధురాలు ఏలూరు కాల్వలో పడి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. హనుమాన్‌జంక్షన్ ఎస్సై జనార్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. బట్టు పాపమ్మ(71) ఏలూరు కాల్వలో పడినట్లు సమాచారం రావడంతో ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో బయటకు తీశారు. అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయింది. దీంతో మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి శవపరీక్షలు నిర్వహించారు. భర్త లేకపోవడంతో ఒంటరిగా నివసిస్తున్న పాపమ్మ మానసిక ఆందోళన కారణంగా కాల్వలోకి దూకినట్లుగా సమాచారం. కుమారుడు రాజు మాత్రం తన తల్లి ప్రమాదవశాత్తూ కాల్వలో పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

# నూరు శాతం అక్షరాస్యతకు కృషి: డీఆర్వో

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ నూతన అక్షరాస్యత కార్యక్రమం ఉల్లాస్‌ను విజయవంతం చేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. ఉల్లాస్ జిల్లా స్థాయి కన్వర్జెన్స్ కమిటీ సమావేశం మంగళవారం డీఆర్వో ఛాంబర్‌లో నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ఉల్లాస్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేసిన విధంగానే మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీల గుర్తింపు ఈనెల 16 నుంచి 24 వరకు నిర్వహించాలన్నారు. 25న రాష్ట్ర స్థాయి, 29న జిల్లా స్థాయి, నవంబర్ 2న మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. నోడల్ అధికారి, జిల్లా వయోజన విద్య ఉపసంచాలకులు హాజీ బేగ్, ఏపీవో ఎ.అజయ్‌కుమార్, ఉప విద్యాశాఖాధికారి శేఖర్‌సింగ్, ఐసీడీఎస్ ఎస్.సువర్ణ పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణ తరగతులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా జిల్లాలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి ఉచిత శిక్షణ కేంద్రం డైరెక్టర్ పి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో సెల్‌ఫోన్ రిపేరింగ్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, మగ్గం, ఎంబ్రాయిడరీ, జ్యూట్ బ్యాగులు, బ్యూటీషన్, టైలరింగ్ తదితర కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం తెలిపారు. ఈనెల 21 నుంచి ప్రారంభమయ్యే శిక్షణ తరగతుల్లో ఆసక్తిగల 18-45ఏళ్ల యువత ఆధార్, రేషన్ కార్డులతో పాటు విద్యార్హత పత్రాలకు హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 63042 54730, 94900 11081 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

# మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

## పల్లె పండగ పనులు సంక్రాంతిలోగా పూర్తి



మంగినపూడి: సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర



మేకావానిపాలెంలో తెదేపా నాయకులు

**మంగినపూడి(మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే:** పల్లె పండగలో భాగంగా రూ.4500 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలను రాబోయే సంక్రాంతి లోపు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. మంగళవారం మంగినపూడి బీచ్ వద్ద ఉపాధి హామీ నిధులు రూ.38 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ మచిలీపట్నం నియోజకవర్గంలో రూ.30 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లు అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి కుళాయి, డ్రైను, రోడ్డు కనెక్టివిటీ ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమన్నారు. మంగినపూడి బీచ్ వద్ద గతంలో ప్రారంభించిన రోడ్లు అసంపూర్తిగా వదిలేశారని, దీనిని ఇప్పుడు 500 మీటర్లు పొడవు, మూడున్నర మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డుగా సెంటర్ డివైడర్‌తో నిర్మిస్తున్నట్లు చెప్పారు. గతంలో రూ.3.5కోట్లతో బీచ్ వద్ద మెరక పనులు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. గత ఐదేళ్లుగా బీచ్‌ను ఎలాంటి అభివృద్ధి లేకుండా మూసివేశారని విమర్శించారు. బీచ్ వద్ద రిసార్టులు, హోటళ్లు నిర్మించానికి అనేకమంది ముందుకు వస్తున్నారని, అవి సాకారమైతే పర్యాటకులకు వసతులు లభించటమేకాక స్థానికులకు పెద్దఎత్తున ఉపాధి లభిస్తుందన్నారు. జనసేన మచిలీపట్నం ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ గోపీచంద్, జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ గోపు సత్యనారాయణ, తెదేపా నేతలు కుంచె నాని, లంకె శేషగిరి, తలారి సోమశేఖర్, తోట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**గోపువానిపాలెం(మచిలీపట్నం రూరల్):** మేకావానిపాలెం, గోపువానిపాలెం గ్రామాల్లో పలు సీసీ రోడ్ల నిర్మాణానికి తెదేపా నాయకులు శంకుస్థాపన చేశారు. జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు కుంచె నాని, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు తలారి సోమశేఖర్, లంకె శేషగిరి, గోపువానిపాలెం సర్పంచి వాలిశెట్టి చంద్రలేఖ, సుధాకర్, వాలిశెట్టి తిరుమలరావు, జొన్నల రంగారావు పాల్గొన్నారు.

### రూ.15.71 కోట్లతో అభివృద్ధి పనులు



చిననందమూరులో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

**పెడన, పెడన గ్రామీణ, న్యూస్‌టుడే:** పల్లె పండగ సందర్భంగా పెడన నియోజకవర్గంలో రూ.15.71 కోట్ల విలువైన 251 పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ చెప్పారు. పెడన మండలం చిననందమూరు, జింజేరు, అచ్చయ్యవారిపాలెం గ్రామాల్లో మంగళవారం రూ.54.60 లక్షల విలువైన ఆరు సిమెంటు రహదార్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. .పల్లె పండగ వారోత్సవాల్లో చేపడుతున్న పనులను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రతి పని దగ్గర బోర్డులు ఏర్పాటు చేసి పూర్తి వివరాలు ప్రజలకు తెలిసేలా చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా గూడూరు మండలంలో రూ.3.31 కోట్లతో 67 పనులు, కృత్తివెన్నులో రూ.3 కోట్లతో 75, పెడనలో రూ.3.2 కోట్లతో 48, బంటుమిల్లిలో ఇదే మొత్తం నిధులతో 60 పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకట నగేష్, ఇన్‌ఛార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో జయరాం, పంచాయతీ రాజ్ ఏఈ ధర్మయ్య, జనసేన కన్వీనర్ పంచకర్ల సురేష్, మండల తెదేపా అధ్యక్షుడు శలపాటి ప్రసాద్, సర్పంచులు పరసా నరసింహారావు, వేముల సత్యనారాయణ, చిత్తజల్లు నరసింహారావు, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నాగఉదయ్‌కుమార్, కూటమి నేతలు దాసరి సత్యనారాయణ, శీరం ప్రసాద్, పరసా రాంబాబు, గుడిశేవ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

**భాస్కరపురం(మచిలీపట్నం):** ఎన్‌సీసీ భవిష్యత్తుకు సోపానమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక చిలకలపూడి పాండురంగ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులకు మంగళవారం మంత్రి ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ 50మంది తొలి దశలో ఎన్‌సీసీలో చేరడం సంతోషకరమన్నారు. ఇలాంటి గొప్ప వ్యవస్థ ఏర్పాటుకు ముందుకు వచ్చిన గైడ్ రామాంజనేయులుకు అభినందనలు తెలిపారు. చిలకలపూడి స్కూల్‌ను జూనియర్ కాలేజీగా మారుస్తామని హామీ ఇచ్చారు.గోపీచంద్, జనసేన ఇన్‌ఛార్జి రామకృష్ణ, కాశీవిశ్వనాథం, తెదేపా మండల అధ్యక్షుడు కుంచె నాని, వెంకట్రావు పాల్గొన్నారు.

## 20న గురుకుల విద్యార్థుల విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

**పెడన గ్రామీణం, న్యూస్‌టుడే:** కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఈనెల 20న వీరపనేని గూడెం గురుకుల పాఠశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయకర్త కె.ప్రేమావతి తెలిపారు. ఈ ప్రదర్శన 6, 7, 8 తరగతుల విద్యార్థులకు జూనియర్ విభాగంగా, 9, 10, ఇంటర్ విద్యార్థులకు సీనియర్ విభాగంగా జరుగుతాయని వెల్లడించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులు జోన్ స్థాయి ప్రదర్శనకు వెళతాయని తెలిపారు. సైన్సు ఉపాధ్యాయులు, ప్రధానాచార్యులు విద్యార్థులను ప్రోత్సాహించాలని సూచించారు.

# భవనాలు బాగుపడేదెప్పుడో?

### బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ★ కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తే మేలు



పెచ్చులూడి వేలాడుతున్న ఇనుప చువ్వలు



కోనేరు సెంటరులో శిథిలావస్థకు చేరిన దుకాణ సముదాయం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

నగరంలోని వివిధ భవనాలు శిథిలావస్థకు చేరి ఇనుప చువ్వలు వేలాడుతున్నాయి. వర్షం వస్తే భవనాల్లోకి చేరిపోతున్నా అక్కడే భయం భయంగా పనులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. వివిధ ప్రాంతాల్లో ఉన్న దుకాణ సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాల భవనాలు కూడా అదేవిధంగా తయారైంది. గతంలో వైకాపా పాలకులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. సంక్షేమ శాఖల కార్యాలయాలకు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోందని సోమవారం నిర్వహించిన దివ్యాంగుల సంక్షేమ కమిటీ సమావేశంలో పలువురు దివ్యాంగులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడం సమస్య తీవ్రతకు అద్దపడుతోంది.

**కూలుతున్న భవనంతో ఆందోళన**

★ నగరపాలకసంస్థ పరిధిలో 500లకు పైగా దుకాణాలు ఉంటే వాటిలో 270 కోనేరు సెంటరు చుట్టుపక్కల ఉన్న దుకాణ సముదాయాల్లోనే ఉన్నాయి. కూడలి నుంచి చూస్తే బహుళ అంతస్తులతో భవనాలు పైకి బాగానే ఉన్నట్టు కనిపిస్తాయి. కానీ లోపలకు వెళ్తే ఏ భవనం ఎప్పుడు కూలిపోతుందో అనట్లుగా తయారయ్యింది. 1950లో నిర్మించిన ఈ భవనాలన్నీ శిథిలావస్థకు చేరాయి. కానీ బంగారు దుకాణాలు తటవర్తి నాగపోతరావు బ్లాక్ మాత్రం ఏక్షణాన కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ బ్లాక్‌లో 74 దుకాణాలు ఉన్నాయి. లోపలకు వెళ్లి చూస్తే ఎటూ చూసినా శ్లాబు పెచ్చులూడి ఇనుప చువ్వలు వేలాడుతూ ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. వర్షం పడితే చాలు నేరుగా దుకాణాల్లోకి చేరిపోతోంది. ఏ క్షణాన ఏంజరుగుతుందోనన్న భయంలో కొందరు దుకాణాలను మూసివేస్తే మరికొందరు బిక్కుబిక్కుమంటూ అక్కడే పనులు చేసుకుంటున్నారు. గతంలో తెదేపా హయాంలో మరమ్మతులకు నిధులు కేటాయించగా తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వంలో ఆగిపోయాయి.



**సంక్షేమ శాఖల భవనాలు అంతే..**

కలెక్టరేట్ ఆవరణలోని వివిధ సంక్షేమ శాఖల కార్యాలయాలున్న భవనం శిథిల స్థితికి చేరింది. బీసీ, సాంఘిక, ఎస్టీ కార్పొరేషన్, వికలాంగుల, సాంఘిక సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ తదితర విభాగాలు ఈ భవన సముదాయంలోనే ఉన్నాయి. అన్ని కార్యాలయాల్లోనూ వర్షం వస్తే బల్లలు, కంప్యూటర్లపై పరదాలు కప్పుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు ఉండే కార్యాలయాలైనా ఏళ్లతరబడి పట్టించుకోకుండా వదిలేయడం విమర్శలకు తావిస్తోంది. తాజాగా దివ్యాంగుల సంక్షేమ కమిటీ సమావేశంలో పలువురు దివ్యాంగులు కార్యాలయానికి వెళ్లడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని, వర్షం వస్తే నీరు నిలబడటంతో పాటు రాళ్లులేచి ఉండడంతో వాహనాలు కూడా పడిపోతున్నాయని కలెక్టర్ డీకే బాలాజీకి మొరపెట్టుకోగా స్పందించిన కలెక్టర్ వెంటనే రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వ హయాంలో అయినా భవనాల సమస్య పరిష్కారం అవుతుందని ఆశతో ఎదురు చూస్తున్నారు.



కృష్ణావిశ్వవిద్యాలయంలో చిత్రపటానికి రెక్టార్ బసవేశ్వరరావు తదితరుల నివాళి



గొడుగుపేటలో నేతాజీ మిత్రమండలి ప్రతినిధులు



మదర్సాలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించిన వైజ్‌మెన్ క్లబ్ ప్రతినిధులు



కృత్తివెన్నులో కొప్పినీడి సూర్యప్రకాష్ తదితరులు

## కలాం సేవలు ఎనలేనివి

**కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం), న్యూస్‌టుడే:** అబ్దుల్‌కలాంను యువత ఆదర్శంగా తీసుకోవాలని కృష్ణావిశ్వవిద్యాలయ రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు అన్నారు. కలాం జయంతి కార్యక్రమాన్ని వివిధ సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కలాం చిత్రపటానికి బసవేశ్వరరావుతోపాటు ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు నివాళులు అర్పించారు. వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు ఎన్.ఉష, సుందరకృష్ణ, దిలీప్, బ్రహ్మయారి, ఎం.కోటేశ్వరరావు, సుశీల, సురేష్, అనిల్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. గొడుగుపేటలో నేతాజీ మిత్రమండలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, పీవీ ఫణికుమార్, సూరిశెట్టి హరికృష్ణ, విన్నకోట సుబ్బారావు, మోపర్తి సుబ్రహ్మణ్యం, కొండా ప్రసాదరావు, జుజ్జూరి ప్రసాదు, శర్మ తదితరులు పాల్గొన్నారు. వల్లేగూడెంలో వైజ్‌మెన్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సయ్యద్‌పీర్ స్థానిక మదర్సాలోని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. రుస్తుంబాద బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతిలో ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, అంబటిపూడి సుబ్రహ్మణ్యం తదితరులు కలాం చిత్రపటానికి నివాళులర్పించారు.

**కృత్తివెన్ను:** మండలంలోని లక్ష్మీపురం పల్లెపాలెంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. కలాం చిత్రపటానికి ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు కొప్పినీడి సూర్యప్రకాష్ పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మారగాని ఏసుబాబు, నడకుదిటి మురళీకృష్ణ, జె.రాజ్యలక్ష్మి, జి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### 22న పెడనలో ఉద్యోగమేళా

**పెడన గ్రామీణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని బొడ్డునాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 22న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ సమన్వయకర్త వి.బాబు తెలిపారు. ఈ సందర్భంగా పెడన నియోజకవర్గ జాబ్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మంగళవారం ఆయన నివాసగృహంలో ఆవిష్కరించారు. నిరుద్యోగ యువత జాబ్ మేళా, స్కిల్ హబ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామారావు, కళాశాల అధ్యాపకులు వీవీ గిరి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి నట్టల నివారణ కార్యక్రమం

**భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే:** కృష్ణా జిల్లాలో గొర్రెలు, మేకల మొదటి విడత నట్టల నివారణ కార్యక్రమం ఈ నెల 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరుగుతుందని జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లాలో 131520 గొర్రెలు, 24295 మేకలు ఉన్నాయని, వీటికి డీవార్మింగ్ మందులను సంబంధిత ఆసుపత్రులకు సరఫరా చేయడం జరిగిందని తెలిపింది.

### సచివాలయ భవనం ప్రారంభం నేడు

**బంటుమిల్లి:** మండలంలోని నాగేశ్వరరావుపేట సచివాలయం, రైతు సేవా కేంద్రం భవనాలను బుధవారం ప్రారంభిస్తున్నట్లు సర్పంచి తాతా మహాలక్ష్మి తెలిపారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ భవనాలను ప్రారంభిస్తారని చెప్పారు.

### మధ్యాహ్న భోజనాన్ని పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**భాస్కరపురం (మచిలీపట్నం):** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మోదుమూడి శ్రీహరి భవన్‌లో సాయికుమార్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వరంగ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులంతా మధ్య తరగతి కుటుంబాల నుంచి వచ్చి విద్య నేర్చుకుంటున్న వారే అని, ఇలాంటి వారి విషయంలో ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కృష్ణా జిల్లా కన్వీనర్ సాదిక్‌బాబు, కార్తీక్, నాని, సంతోష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### పెద నందమూరులో అగ్నిప్రమాదం

**పెడన, న్యూస్‌టుడే:** పెడన మండలం పెద నందమూరు గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక ఇల్లు అగ్నికి ఆహుతికాగా రూ.లక్ష ఆస్తి నష్టం జరిగిందని ఇన్‌ఛార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్ చెప్పారు. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా పరసా రాజారావుకు చెందిన రేకుల షెడ్డు ఇల్లు దగ్ధమైనట్లు వెల్లడించారు. ఆర్ఐ విజయలక్ష్మి సంఘటన స్థలానికి వెళ్లి ప్రమాద ఘటనపై విచారించారు.







మచిలీపట్నం: సమగ్ర శిక్షా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రదర్శన



గూడూరులో ఉపాధ్యాయులు, విద్యార్థులు

## అభ్యసన వైకల్యాలపై అవగాహన

**మచిలీపట్నం (గొడుగుపేట), గూడూరు:** మచిలీపట్నంతోపాటు గూడూరు తదితర ప్రాంతాల్లో మంగళవారం సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్దిష్ట అభ్యసన వైకల్యాలపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఉద్యోగులు వివిధ వైకల్యాలు, సమగ్రశిక్ష ద్వారా ప్రత్యేక అవసరాల చిన్నారులకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించి తల్లిదండ్రులు వినియోగించుకునేలా చొరవతీసుకోవాలని కోరారు. మచిలీపట్నంలోని రుస్తుంబాద బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో గురుప్రసాదు, సమగ్రశిక్ష ఏపీవో కె.ఏడుకొండలు, హెచ్‌ఎం బి.రామకృష్ణ, ఐఈఆర్పీ స్వాతి తదితరులు పాల్గొన్నారు. గూడూరులో ఎంఈవో సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎంలు పుష్పలత, పద్మజ, ఐఈఆర్పీలు పి.రమాదేవి, సజనీబేగం తదితరులతోపాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ర్యాలీచేశారు.



అర్తమూరులో దరఖాస్తులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

## పట్టభద్రులూ.. ఓట్లు నమోదు చేసుకోండి

**బంటుమిల్లి, న్యూస్‌టుడే :** 2021 నాటికి డిగ్రీ, బీటెక్ పూర్తయిన ప్రతి ఒక్కరూ పట్టభద్రులుగా ఓటు నమోదు చేసుకోవడానికి అర్హులని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని అర్తమూరులో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పట్టభద్రుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. నియోజకవర్గంలోని ప్రతి పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. డిగ్రీ పట్టా, ఆధార్ కార్డు, ఫొటో, ఓటరు కార్డుతో నమోదు చేసుకోవాలని సూచించారు. తెదేపా మండల కన్వీనర్ కూనపురెడ్డి వీరబాబు, మండల కార్యదర్శి బొర్రా కాశీ విశ్వేశ్వరరావు, జొన్నలగడ్డ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి సుందరీకరణపై దృష్టి

**రామవరప్పాడు, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు వచ్చే పారిశ్రామికవేత్తలు గన్నవరం విమానాశ్రయం నుంచి రామవరప్పాడు జాతీయ రహదారి మీదుగా రాజధాని అమరావతికి చేరుకుంటారని, ఈ మార్గాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సుందరీకరణ, పచ్చదనంపై దృష్టి పెట్టాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మంగళవారం పటమటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్, జాతీయ రహదారులు, పంచాయతీ అధికారులతో యార్లగడ్డ వెంకట్రావు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెటర్నరీ కళాశాల వద్ద చేయాల్సిన సుందరీకరణ పనులు, రామవరప్పాడు రింగ్ నుంచి విమానాశ్రయం వరకు చేయాల్సిన బ్యూటిఫికేషన్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. వీటితో పాటు ఇతర సమస్యలను గతంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకువెళ్లినట్లు పేర్కొన్నారు. కేసరపల్లి నుంచి రామవరప్పాడు వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేయించాలని సూచించారు. తమకు శానిటరీ సిబ్బంది, పోలీస్ సహకారం కావాలని అధికారులు ఎమ్మెల్యేను కోరడంతో ఆయన వెంటనే ఎయిర్‌పోర్టు డైరెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజేంద్రరెడ్డి, జీఎం దయాకర్‌బాబు, ప్రిన్సిపల్ ల్యాండ్ స్కేప్ అర్కిటెక్ సత్యనారాయణ, డీడబ్ల్యూఎం కృష్ణ, ఏపీడీ నారాయణరావు, ఏపీవో లక్ష్మి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డిస్లెక్సియాపై అప్రమత్తత అవసరం



పెడన: ప్రదర్శనలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



డిస్లెక్సియా బోర్డు ప్రదర్శిస్తున్న ఎస్‌కేవీడీ ప్రసాదరావు

**పెడన, న్యూస్‌టుడే:** డిస్లెక్సియాపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఎంఈవో వైవీ హరినాథ్ చెప్పారు. కండరాలకు సంబంధించిన ఈ వ్యాధిపై ప్రతి ఏడాది అక్టోబరులో విద్యాశాఖ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం పెడనలో 2కే నడక(వాక్‌థాన్)ను ఎంఈవో స్థానిక బంగ్లా స్కూల్లో ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ..కండరాల బలహీనతతో ప్రారంభమయ్యే ఈవ్యాధిని నిర్లక్ష్యం చేస్తే క్యాన్సర్‌కు దారితీస్తుందన్నారు. తల్లితండ్రులు తమ పిల్లల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు గమనించాలని ఎలాంటి లోపాలు గుర్తించినా సమీపంలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో బంగ్లాస్కూలు ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పి.షణ్ముఖరావు, ఐఈఆర్పీ ఎన్.రమ్య తదితరులు పాల్గొన్నారు.

**కృత్తివెన్ను:** నీలిపూడి గ్రామ పంచాయతీ లోని నాన్‌భవిత కేంద్రంలో అభ్యసనా వైకల్యంపై అవగాహన సదస్సును ఎంఈవో-2 ఎస్‌కేడీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రసాదరావు మాట్లాడుతూ డిస్లెక్సియా ఉన్న పిల్లలు చదవడం, రాయడంలో ఇబ్బందులు పడుతుంటారని తెలిపారు. ఈ పిల్లలకు బిగ్గరగా చదవడంలో కష్టాలు పడడం, అక్షరాల ఆకృతిలో మార్పులు, కథ, సంఘటనలను సంగ్రహించడంలో ఇబ్బందులు, పదాలు మార్చి రాయడం తదితర లక్షణాలు ఉంటాయన్నారు. మెదడు క్రమ రాహిత్యాన్ని సరిదిద్దడానికి ప్రత్యేకమైన మందులు లేవన్నారు. చిన్న వయస్సులోనే గుర్తించడం, శిక్షణ ఇవ్వడం వల్ల అవగాహన స్థాయి పెంచవచ్చని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని భారతి, ఉపాధ్యాయుడు శంకరరావు, సీఆర్పీ తంబిబాబు, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు వసతులు కల్పించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, ఉద్యోగులు

**మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే:** నగరపాలకసంస్థ కార్యాలయంలో విధులు నిర్వహించే ఉద్యోగులకు పలు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ మచిలీపట్నం శాఖ నాయకులు మంగళవారం కమిషనర్ బాపిరాజుకు వినతిపత్రం అందజేశారు. వాహనాల పార్కింగ్ స్థలం వద్ద మహిళల మరుగుదొడ్లు ఉండటంతో అక్కడకు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉందని, వారే ప్రాంతానికి మార్చాలని కోరారు. అన్ని మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించాలని, ప్రతిసెక్షన్‌కు అవసరమైన పరికరాలు అందించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. సంఘ నాయకులు వి.కృష్ణసాయి, గోపాల్, బిఎన్‌వి లక్ష్మితోపాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

## రూ.10 నాణేల చెలామణిపై దుష్ప్రచారం నమ్మొద్దు



నాణేలు పంపిణీ చేస్తున్న అధికారులు

**మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే:** రూ.10 నాణేలు అన్నీ చెల్లుతాయని, వీటి చెలామణిపై ఉన్న దుష్ప్రచారం ఎవ్వరూనమ్మవద్దని యూనియన్ బ్యాంకు అధికారులు అన్నారు. మంగళవారం నగరంలోని రైతుబజారులో రూ.10 నాణేల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు డిప్యూటీ రీజనల్ హెడ్ రామలింగారెడ్డి, అధికారులు సురేష్, నవక్రాంత్, నందకిషోర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. నాణేల పంపిణీకి ప్రజలనుంచి మంచి స్పందన లభించిందని అధికారులు తెలిపారు. రూ.25వేల విలువైన నాణేలను ప్రజలు తీసుకున్నారని అన్నారు. వీటి చెలామణిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు.

## ‘క్రిమీలేయర్ విధానంతో దళిత జాతికి నష్టం’

**చిన్నాపురం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే:** షెడ్యూల్ కులాలలో క్రిమీలేయర్ విధానాన్ని అమలు చేయడం వల్ల దళిత ప్రజానీకం తీవ్రంగా నష్టపోతుందని ఏపీ షెడ్యూల్ కులాల వెల్ఫేర్ అసోసియేషన్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు కర్రా సునీల్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్లకు అనుకూలంగా ఇచ్చిన తీర్పుపై దళిత జాతికి అవగాహన కలిగించేందుకు మంగళవారం చిన్నాపురం, గుండుపాలెం గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు వర్గీకరణ విషయంలోను, క్రిమిలేయర్ విషయంలోను పునరాలోచన చేసి అందరి అభివృద్ధిని కాంక్షించే నిర్ణయం తీసుకోవాలని కోరారు. గంట చిన్న వెంకటేశ్వరరావు, ఇంతేటి నాగరాజు, బీఎస్పీ నాయకులు విజయ్ జాలాది రాజా, చిన్నాపురం గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.



దళితులతో సునీల్‌కుమార్ తదితరులు

### దస్తావేజులు పోయినవి

కృష్ణాజిల్లా పెడన మండలం లంకలకలవగుంట గ్రామములోని (1) R.S.No. 245 Ext. 2.00 (2) R.S.No. 252 Ext. 1.00 వెరసి 3.00కు సంబంధించి విశాఖపట్నం శివాజీపాలెం, డోర్ నెం. 9-5-67/5-1రు కాపురస్తులు వ్యవసాయం వృత్తి వంతులు సింగరాజు సుబ్బరాజు గారి కుమారుడు కృష్ణంరాజు గారు పేరున దస్తావేజు నెం. 1838/2007 తేది. 3-10-2007 గల ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. ఈ దస్తావేజులు ఎవరికైన దొరికిన మరియు ఎవరి దగ్గరైన కుదవపెట్టిన ఎట్టి అభ్యంతరములు ఉన్నయెడల ఈ పేపర్ యాడ్ వేసిన నాటినుండి 10 రోజులలో ఈ క్రింది నెంబర్లకు కాల్ చేయగలరు. ఈ యాడ్ బంటుమిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నెం. హెచ్ 91 ద్వారా.

**ఆత్మూరి ఉదయభాస్కరరావు, C.E.O**
**Bantumilli P.A.C.S. Ltd.,**
**No: H.91, Bantumilli**
సెల్: 93257 64220, 98483 73869
తేది: 15-10-2024,

# పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

## యువతి అదృశ్యం

**పెనమలూరు, న్యూస్‌టుడే:** పోరంకికి చెందిన యువతి ఈ నెల 14వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి చేరుకోలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM**

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

**స్పందనకు వందనం**

★ బాపులపాడు జగనన్న కాలనీకు వెళ్లే ప్రధాన రహదారి అత్యంత దారుణంగా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో దీనిని అభివృద్ధి చేయలేదు. దీంతో ప్రస్తుత వర్షాకాలంలో కాలనీ వాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా గ్రామ పంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకువెళ్లగా, స్పందించిన పాలకవర్గం ఇటీవల రహదారిని బాగుజేయించింది.

-న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

## జాతీయ రహదారి సుందరీకరణపై దృష్టి

**రామవరప్పాడు, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు వచ్చే పారిశ్రామికవేత్తలు గన్నవరం విమానాశ్రయం నుంచి రామవరప్పాడు జాతీయ రహదారి మీదుగా రాజధాని అమరావతికి చేరుకుంటారని, ఈ మార్గాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సుందరీకరణ, పచ్చదనంపై దృష్టి పెట్టాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మంగళవారం పటమటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్, జాతీయ రహదారులు, పంచాయతీ అధికారులతో యార్లగడ్డ వెంకట్రావు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెటర్నరీ కళాశాల వద్ద చేయాల్సిన సుందరీకరణ పనులు, రామవరప్పాడు రింగ్ నుంచి విమానాశ్రయం వరకు చేయాల్సిన బ్యూటిఫికేషన్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. వీటితో పాటు ఇతర సమస్యలను గతంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకువెళ్లినట్లు పేర్కొన్నారు. కేసరపల్లి నుంచి రామవరప్పాడు వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేయించాలని సూచించారు. తమకు కౌంటర్ సిబ్బంది, పోలీస్ సహకారం కావాలని అధికారులు ఎమ్మెల్యేను కోరడంతో ఆయన వెంటనే ఎయిర్‌పోర్టు డైరెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజేంద్రరెడ్డి, జీఎం దయాకర్‌బాబు, ప్రిన్సిపల్ ల్యాండ్ స్కేప్ అర్కిటెక్ సత్యనారాయణ, డీడ బ్యూఎం కృష్ణ, ఏపీడీ నారాయణరావు, ఏపీవో లక్ష్మి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# క్షీణించిన పారిశుద్ధ్యం

**పోరంకి, కానూరు న్యూస్‌టుడే**

తాడిగడప పురపాలిక పరిధిలో క్లాప్ డ్రైవర్ల సమ్మె ప్రభావం పారిశుద్ధ్యంపై తీవ్రంగా పడింది. గత మూడు నెలలుగా జీతాలందక 45 మంది క్లాప్ డ్రైవర్లు చేపట్టిన సమ్మె నాలుగు రోజులుగా కొనసాగుతోంది. పురపాలిక పరిధిలోని పోరంకి, తాడిగడప, కానూరు, యనమలకుదురు సర్కిళ్లలో ఏ వీధిలో చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే డంపింగ్ యార్డ్ కూడా లేకపోవడంతో చెత్తంతా పార్కుల్లో వేయడంతో అవి డంపింగ్‌యార్డులుగా



తాడిగడప పరిధిలో భారీగా పేరుకు పోయిన చెత్త

మారి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. మరోపక్క దోమల ఉద్ధృతి పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం

### క్లాప్ డ్రైవర్ల సమ్మెతో వీధులు దుర్గంధభరితం

ఉందని నివాసితులు ఆందోళన చెందుతున్నారు. మంత్రి పార్థసారథి, స్థానిక ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కలుగజేసుకొని కార్మికుల వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వంతో మాట్లాడి సమ్మెను విరమింపజేయాలని పురపాలిక ప్రజలు కోరుతున్నారు.

**ప్రజారోగ్యాన్ని కాపాడాలి**

**- పల్లం పాపారావు, యనమలకుదురు**



కార్మికులు సమ్మెకు దిగడంతో అంతంత మాత్రంగా ఉన్న పారిశుధ్యం మరింత దిగజారింది. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే పరిస్థితి ఎదురయ్యింది. రోడ్లు, ఇళ్ల మధ్య వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతోంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కార్మికుల న్యాయమైన సమస్యను పరిష్కరించి ప్రజారోగ్యాన్ని కాపాడాలి.

**పొంచి ఉన్న వ్యాధుల భయం**

**- సీహెచ్ భవాని, నివాసితురాలు, తాడిగడప**



సమ్మె కొనసాగితే వీధులన్నీ డంపింగ్ యార్డులుగా తయారవుతాయి. ఫలితంగా వ్యాధులు విజృంభించే అవకాశం ఉంది. నాలుగు రోజుల సమ్మెకే చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లడం వల్ల ముక్కు మూసుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. దీనికితోడు చెత్త కుప్పల వద్దకు కుక్కలు చేరి దాడి చేస్తున్నాయి. అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది.

**ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నడుచుకుంటాం**

ఒప్పందం ప్రకారం.. స్వయంభు ఏజెన్సీ వారు కార్మికులకు వేతనాలు చెల్లించాల్సి ఉన్నా సక్రమంగా ఇవ్వడం లేదు. పుర ప్రజల నుంచి చెత్తపన్ను వసూలు చేయడం లేదు. మా చేతుల్లో ఏమీ లేదు. ప్రభుత్వం నుంచి వచ్చే మార్గదర్శకాల ప్రకారం నడుచుకుంటాం.

**- భవానీ ప్రసాద్, వైయస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్**

## జనవరి నుంచి అభివృద్ధి పనులు వేగవంతం

**పెనమలూరు, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో రానున్న జనవరి నుంచి అభివృద్ధి పనుల్లో వేగం పెరగనుందని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. మంగళవారం పెనమలూరు పంచాయతీరాజ్ కాలనీలో రూ.18 లక్షల వ్యయంతో అభివృద్ధి చేయనున్న రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైకాపా పాలనలో మంచినీటి ట్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీలకు పార్టీ రంగులు వేయడం తప్ప.. ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు.



పెనమలూరు: ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఎమ్మెల్యే ప్రసాద్‌కు సమస్యలు వివరిస్తున్న గ్రామస్థులు

**కంకిపాడు గ్రామీణం:** ఈడుపుగల్లు బీసీ కాలనీలో రూ.40 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ శంకుస్థాపన చేశారు. సర్పంచి ఇందిర, దేవినేని రాజా, సుదిమళ్ల రవీంద్ర, ఎంపీడీవో అనూష, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

**రామవరప్పాడు:** రామవరప్పాడులో రూ.37 లక్షలు, ఎనికేపాడులో 1.03 కోట్లు, నిడమానూరులో రూ.25 లక్షలు, గూడవల్లిలో రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శంకుస్థాపన చేశారు.

**హనుమాన్‌జంక్షన్ :** బందారుగూడెం రూ.17 లక్షలతో ఒక సీసీ రోడ్డు, కొడూరుపాడులో రూ.29.50 లక్షలతో రెండు సీసీ రోడ్లు, వీరవల్లిలో రూ.42 లక్షలతో రెండు సీసీ రోడ్లకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శంకుస్థాపన నిర్వహించారు. ఎంపీడీవో జోగేశ్వరరావు, నాయకులు చలమలశెట్టి రమేష్, బేతాళ మాణిక్యాలరావు, నాగరాజు, కొండపల్లి వెంకన్న, సూరిబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పెద్దఅవుటపల్లిలో రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

### సీఎం చంద్రబాబుతోనే పల్లె ప్రగతి సాధ్యం

**పెద్దఅవుటపల్లి, పొట్టిపాడు(గన్నవరం గ్రామీణం) :** సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలోనే పల్లె ప్రగతి సాధ్యమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లి, పొట్టిపాడులో నిర్వహించిన పల్లె పండుగలో పాల్గొన్నారు. ఆయన రూ.1.07కోట్ల వ్యయంతో నాలుగు నూతన రోడ్ల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. తొలుత పెద్దఅవుటపల్లిలో 1500 మీటర్ల మేర రూ.80లక్షల సీసీ రోడ్డుకు, పొట్టిపాడులో 750మీటర్ల మేర బీటీ రోడ్డు ఏర్పాటుకు శంకుస్థాపన చేపట్టారు. అనంతరం పలువురు స్థానిక సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని రాగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో సత్యకుమార్, తెదేపా నాయకులు, తెలుగు మహిళలు, యువత పాల్గొన్నారు.

## ఆకలి కేకలు పట్టవా?



పోరంకి సెంటర్‌లో క్లాప్ డ్రైవర్ల నిరసన

**పోరంకి :** తాడిగడప మున్సిపాలిటీలో మూడు నెలలుగా జీతాలందక ఆకలితో అలమటిస్తున్నామని, తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ చెత్త తరలింపు వాహనాల డ్రైవర్లు విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పోరంకి సెంటర్లో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా నాయకుడు ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ గత నెల 26వ తేదీన కమిషనర్ భవానీ ప్రసాద్‌కు కార్మికులంతా అర్జీ ఇచ్చినా ఇంతవరకు జీతాలు పడలేదని అన్నారు. నాయకులు మస్తాన్‌వలి, సరళ, గుంజి నరసయ్య, నేరెళ్ల, నరేంద్ర, సురేష్, దుర్గారావు, హరీష్, సూర్యనారాయణ, మస్తాన్, రాంబాబు, రాజు, ప్రసాద్‌లతో పాటు కానూరు, యనమలకుదురు, పోరంకి, తాడిగడప క్లాప్ వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.



## కలాం జీవితం యువతకు ఆదర్శం



ఉయ్యూరు: నివాళులర్పిస్తున్న సాంబశివరావు, తేజ

**ఉయ్యూరు, న్యూస్‌టుడే:** అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని లయన్స్ జిల్లా క్యాబినెట్ డిప్యూటీ కార్యదర్శి నూకల సాంబశివరావు అన్నారు. ఉయ్యూరులో మంగళవారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తేజ ఆధ్వర్యంలో ఏర్పాటైన కలాం జయంతిలో నూకలతో పాటు తేజ, లయన్స్ జోనల్ ఛైర్‌పర్సన్ ఎం.డి.ఇస్మాయిల్, కార్యదర్శి రాంబాబు తదితరులు నివాళులర్పించారు. సంఘ్ ఆధ్వర్యంలో కలామ్ జయంతి నిర్వహించారు. తాళ్లూరి అశోక్, సీసీవో పి.నాగేశ్వరరావు, జిల్లా బాడీబిల్డింగ్ సభ్యులు రాజేష్, నరేంద్ర, కోటి, క్రీడాకులు, మాతృ హృదయ్ సేవా సంఘ్ సభ్యులు పాల్గొన్నారు.

**కానూరు, న్యూస్‌టుడే :** కానూరులోని అశోక్ జిమ్‌లో మాతృ హృదయ్ స్వచ్ఛంద సేవా

## మల్బరీ సాగుకు ప్రోత్సాహం

**హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే:** జిల్లాలో మల్బరీ సాగు చేసే రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు పట్టుపరిశ్రమ శాఖ డీడీ డి.వాణి పేర్కొన్నారు. మంగళవారం కె.సీతారాంపురంలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎకరాకు రూ.30 వేల వరకు మల్బరీ సాగుకు ఖర్చు అవుతుందని, ఇందులో ఎస్సీ రైతులకు 90 శాతం, బీసీలకు 75 శాతం రాయితీగా అందిస్తున్నామన్నారు. గన్నవరం ఒక్కో రైతుకు ఐయిదెకరాల వరకు రాయితీ వర్తిస్తుందన్నారు. అనంతరం మండల వ్యవసాయాధికారిణి జె.భవాని వరిలో ఎలుకల నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు.

## సస్యరక్షణ చర్యలపై అవగాహన

**గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే:** గన్నవరం మండలం చిన్నఅవుటపల్లి, తెంపల్లి గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సస్యరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎరువుల వాడకం, సూక్ష్మపోషకాల లోపం నివారణ చర్యలు, సబ్సిడీ పథకాలు, ఇతర పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పొలం పిలుస్తోందిలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా డీడీఏ మనోహర్‌రావు, ఏడీఏ సునీల్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్యకర పోటీతత్వం అవసరం

**ఉయ్యూరు, న్యూస్‌టుడే:** క్రీడాకారుల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వం అలవడాలని ఎంఈవో సుధారాణి అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పెనమలూరు నియోజకవర్గ వాలీబాల్ బాలుర, బాలికల అండర్ 17, 14 జట్లు ఎంపిక కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఇందులో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఈ నెల 16, 17 తేదీల్లో జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జడ్పీ ఉన్నత హెచ్ఎం జ్యోత్స్నాదేవి, ఉయ్యూరు, కంకిపాడు, పెనమలూరు మండలాల స్పోర్ట్స్ అధికారులు జి.వి.రమణ, హరిగోపాల్, సురేష్‌కుమార్‌లు పర్యవేక్షించారు.

**కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని గోసాల సమీపంలోని హెచ్ఎంకే పాఠశాల విద్యార్థులు



జిల్లా పోటీలకు ఎంపికైన వాలీబాల్ బాలుర జట్టు

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సుక్‌మిత్‌కౌర్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో నియోజకవర్గ స్థాయిలో 14ఏళ్ల విభాగంలో ప్రతిభ చాటిన ఎం.అక్షయ, వై.నిరుపమ, గౌతంకృష్ణలను అభినందించారు. వీరి ఈనెల 16, 17వతేదీల్లో విజయవాడలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్ వసంత్‌కుమార్, వ్యాయామోపాధ్యాయుడు సిరీష్ రాజు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రిన్సిపల్ సుక్‌మిత్‌కౌర్, పక్కన వ్యాయామోపాధ్యాయుడు సిరీష్ రాజు

## విభిన్న ప్రతిభావంతులను గుర్తించాలి

**ఉయ్యూరు, న్యూస్‌టుడే:** విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించాలని ఎంఈవో సుధారాణి అన్నారు. ఉయ్యూరులోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ప్రపంచ డిస్లెక్సియా నివారణా దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. భవిత కేంద్రం పర్యవేక్షకురాలు గీత, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని జ్యోత్స్నాదేవి తదితరులు పాల్గొన్నారు.

**హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే:** ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెంపొందించేందుకు వీరవల్లి భవిత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.





ర్యాలీలో ఎంఈవో సుధారాణి

ఎంఈవో-2 బి.సురేష్‌కుమార్, ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి విద్యార్థులతో కలిసి వాక్‌థాన్ పేరుతో గ్రామంలో ప్రదర్శన చేశారు. ఈ నెల 18 వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని భవిత కేంద్రం ఐఈడీ ఉపాధ్యాయులు చంద్రకళ, సుశీల, నాగమణి తెలిపారు.

**గన్నవరం గ్రామీణం:** పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలను గుర్తించి తగిన విధంగా బోధన ఉండాలని గన్నవరం మండల విద్యాశాఖాధికారి కె.రవికుమార్ అన్నారు. మంగళవారం గన్నవరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని భవిత కేంద్రం నుంచి డిస్లెక్సియా అవగాహన ర్యాలీని నిర్వహించారు.







## పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

**హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే:** హనుమాన్‌జంక్షన్ పరిధిలో ఉన్న పట్టభద్రులంతా విధిగా తమ ఓటు నమోదు చేసుకోవాలని తెదేపా గ్రామ అధ్యక్షుడు అట్లూరి శ్రీను సూచించారు. త్వరలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఎమ్మెల్సీ ఎన్నిక జరగబోతుందని, ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే పట్టభద్రులంతా మరోసారి తమ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. మంగళవారం తెదేపా కార్యాలయంలో ఓటు నమోదు దరఖాస్తు ఫారాలు పంపిణీ చేశారు. నాయకులు సురేష్, రాజేశ్వరరావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

**గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే:** విద్యుత్తు తీగల మరమ్మతుల కారణంగా గన్నవరం పరిధిలోని వీరపనేనిగూడెం సబ్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాజు ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా తెంపల్లి, కొత్తగూడెం, చిక్కవరం, బీబీగూడెం పంచాయతీల పరిధిలో ఉదయం 8గంటల నుంచి 11గంటల మధ్య సరఫరా నిలివేయనున్నట్లు చెప్పారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన నేడు

**పెనమలూరు, ఉయ్యూరు గ్రామీణం:** పెదపులిపాకలో రూ.2 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ బుధవారం సాయంత్రం 4 గంటలకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఉయ్యూరు మండలం గండిగుంట, చిన ఓగిరాల, పెద ఓగిరాల, ఆకునూరు గ్రామాల్లో రూ.281.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ శంకుస్థాపన చేస్తారని ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు తెలిపారు.

**హనుమాన్‌జంక్షన్:** చిరివాడలో మధ్యాహ్నం 3.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, అనంతరం ఆరుగొలను, కానుమోలు, పెరికీడు, కొయ్యూరు, బొమ్ములూరు, బాపులపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో శంకుస్థాపనలు జరుగుతాయన్నారు.

## ఎన్‌సీసీ క్యాడెట్ ప్రతిభ

**ఉయ్యూరు, న్యూస్‌టుడే:** చిత్తూరు జిల్లాలో 35వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ట్రెక్కింగ్ క్యాంప్‌లో ఉయ్యూరు ఏజీఎస్‌జీఎస్ కళాశాలకు చెందిన క్యాడెట్ ప్రతిభ చూపి బంగారు పతకం పొందాడు. ఆటల పోటీల విభాగంలో కాకినాడ గ్రూప్(ఆంధ్రా, తెలంగాణ) వాలీబాల్‌లో ప్రథమ స్థానం సాధించింది. ఈ కళాశాలకు చెందిన క్యాడెట్ మనోజ్‌కుమార్ ప్రతిభ చూపాడు. పతకం అందుకున్న మనోజ్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ శివనాథ్, ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ఎన్‌సీసీ అధికారి తేజ తదితరులు అభినందించారు.

## భక్తులకు అన్నదానం

**హనుమాన్‌జంక్షన్:** హనుమాన్‌జంక్షన్ అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. గుడివాడకు చెందిన తమ్మా భాస్కరరావు, వెంకట లక్ష్మీనరసమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

## ఇరువర్గాల ఘర్షణ

**గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే:** ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్న సంఘటన గన్నవరం మండలం పురుషోత్తపట్నంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక రేషన్ దుకాణం వద్ద గ్రామానికి చెందిన వెరపర్ల మహేష్‌తో పాత గొడవ విషయమై కోటా కొండలరావు మధ్య మాటామాటా పెరిగి వివాదానికి దారితీసింది. ఈ క్రమంలో ఉదయం తన తల్లిని తీసుకొని వచ్చి పోలీసులకు మహేష్ ఫిర్యాదు చేశారు. సాయంత్రం ఇంటికి వెళ్లిన మహేష్‌తో పాటు తల్లి నాగమల్లీశ్వరీ, తండ్రి ఆంజనేయులు సహా మరో ఇద్దరిపై అదే గ్రామానికి చెందిన కోటా కొండలరావు కుటుంబీకులు కత్తితో దాడిచేసి గాయపర్చారు. పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ





? సాయినగర్‌లో సాయిబాబా ఆలయానికి వెళ్లే రహదారి పాడై పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. - **చాట్ల రమేష్, పామర్రు**

✔ ఉపాధి నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం. - **సలీమ్, పంచాయతీ కార్యదర్శి**

? చల్లపల్లి రోడ్డులో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. - **కుమార్, పామర్రు**

✔ చెత్త తొలగించి సంపద కేంద్రానికి తరలించి సమస్య పరిష్కరిస్తాం. - **కె.సుధాకరరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్**

? పమిడిముక్కల పంచాయతీలోని ఎన్టీఆర్ కాలనీ పరిసర ప్రాంతాల్లో మురుగు పారుదల కావడం లేదు. పక్కా డ్రెయినేజీ నిర్మించి దుర్వాసన, దోమల బెడద నివారించాలి. - **యడ్లపాటి దుర్గారావు, వీరంకిలాకు**

✔ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.60 లక్షలు కేటాయించినట్లు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తెలిపారు. త్వరలో పనులు చేపడతాం. - **ముళ్లపూడి సునీత, సర్పంచి**

? మేడూరులో జల్‌జీవన్ పథకంలో ఇంటింటికీ కుళాయిలు ఎప్పటి నుంచి ఏర్పాటు చేస్తారు? - **కె.పోతరాజు, మేడూరు**

✔ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు రాగానే చర్యలు తీసుకుంటాం. - **విక్టర్‌పాల్, ఎంపీడీవో**

న్యూస్‌టుడే, పామర్రు, పమిడిముక్కల

స్పందనకు వందనం

**మోపిదేవి, న్యూస్‌టుడే:** మోపిదేవి శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంపై లైట్లు ఏర్పాటు చేశారు. సోమవారం మేమున్నాం..మీకోసం శీర్షికతో ఆలయంపై దీపాలు వెలగడం లేదనే సమస్యపై వార్త ప్రచురితమైంది. ఆలయ కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామవరప్రసాద్, ఆలయ పర్యవేక్షకులు బి.సత్యనారాయణ చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించారు.

## డ్రెయినేజీల అభివృద్ధికి నిధులు మంజూరు

**ఘంటసాల (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే:** నియోజకవర్గంలో మురుగుకాల్వల వ్యవస్థను అభివృద్ధి చేయడానికి సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సహకారంతో రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఎస్.డి.ఎం.ఎఫ్) నిధులు రూ.5.93కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఘంటసాలలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సామావేశంలో ఆయన మాట్లాడారు. మేడూరు, పమిడిముక్కల, అచ్చంపాలెం, కొడాలి, దేవరకోట గుండేరు పరిధిలోని ప్రధాన డ్రెయిన్ అభివృద్ధికి రూ.1.95కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. రత్నకోడు డ్రెయిన్ అభివృద్ధికి రూ.73.35లక్షలు, అవనిగడ్డ డ్రెయినేజీ సెక్షన్-1 అభివృద్ధికి రూ.15.66 లక్షలు, గోపన్న చెరువు డ్రెయిన్‌కు రూ.9.55లక్షలు, చల్లపల్లి చిల్లరవాగు డ్రెయిన్‌కు రూ.24.89లక్షలు, అవనిగడ్డ డ్రెయినేజీ సెక్షన్-1లో ఔట్‌ఫాల్ సూయిజ్‌లు, కేఈటీ బ్యాంక్స్ అభివృద్ధికి రూ.19లక్షలు మంజూరైనట్లుగా ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఇరిగేషన్ రంగాన్ని సమగ్రంగా అభివృద్ధికి రూ.2.83కోట్లు మంజూరు కాగా పనులకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పులిగడ్డ అక్విడెక్టు పరిరక్షణ పనులు, లాకుల వ్యవస్థ తదితర పనులను చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు టి.చౌదరిబాబు, సీనియర్ నేత పి.సుబాష్‌చంద్రబోస్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## కొలిక్కిరాని జాతీయ రహదారి స్థల వివాదం

**నిడుమోలు(కూచిపూడి):** విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిలోని మొవ్వ మండలం నిడుమోలు కూడలిలో స్థల వివాదం పరిష్కారానికి నోచుకోలేదు. దశాబ్దం కిందట నిర్మించిన ఈ జాతీయ రహదారి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జేసీ గీతాంజలి శర్మ మంగళవారం అధికారులను ఆదేశించారు. దీంతో ఉయ్యూరు ఆర్డీవో బి.ఎస్.హెలాషారోన్, మొవ్వ తహసీల్దారు కె.మస్తాన్, సర్వేయర్ శ్యామ్‌తో కలిసి విచ్చేసి సమస్యపై ఆరా తీశారు. తనకు మూడు సెంట్ల భూమి ఉండగా ఎన్‌హెచ్ అధికారులు 80 మీటర్లుగా నమోదు చేసి నష్టపరిహారం ఇచ్చేందుకు రాగా అంగీకరించలేదని స్థల యజమాని బత్తిన ఈశ్వరరావు తెలిపారు. స్థలం కాగితాలు ఇవ్వాలని అధికారులు కోరగా 18న అందిస్తానని పేర్కొన్నారు. మండల సర్వేయర్ ఎ.కిశోర్, వీఆర్వో ఎ.రవి తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల బిల్లులు.. చిగురించిన ఆశలు

### 2014-19 మధ్య గృహనిర్మాణ బకాయిల చెల్లింపుపై కసరత్తు

న్యూస్‌టుడే, నాగాయలంక, గుడివాడ గ్రామీణం, పామర్రు గ్రామీణం

ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులపై గత వైకాపా ప్రభుత్వం ఏమాత్రం జాలి చూపలేదు. వివిధ దశల్లో సగంలో నిలిచిపోయి అవస్థలు పడుతున్నా పట్టించుకోలేదు. బిల్లుల కోసం అయిదేళ్లుగా ఆశగా నిరీక్షించారు. ప్రస్తుతం కూటమి పాలనలో అసంపూర్తి నిర్మాణాల పూర్తికి పరిశీలన చేయడం, బకాయిల చెల్లింపుల కోసం కార్యాచరణ చేపట్టడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ..ఎన్టీఆర్ గృహనిర్మాణ లబ్ధిదారుల పరిశీలనలో భాగంగా ఆ శాఖ సహాయ ఇంజినీరింగ్ సిబ్బంది గ్రామాల్లో ఇటీవల చేపట్టిన సర్వే పూర్తయింది. నియోజకవర్గంలోని నాగాయలంక, అవనిగడ్డ, కోడూరు, మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల మండలాల్లో వివిధ దశల్లో నిలిచిపోయిన గృహాలు 3,069 ఉన్నట్లు నమోదు చేశారు. ఆయా లబ్ధిదారులకు రూ.608.77 లక్షల మేర బకాయిలు చెల్లించాల్సి ఉన్నట్లు నిర్ధారించారు. ఇందులో పునాది దశల్లో ఉన్నవి, స్తంభాలు వేసి స్లాబు దశకు చేరుకున్నవి, పైకప్పు పూర్తి అయినవి, నిధులు రాకపోయినా లబ్ధిదారులు అప్పులు చేసి పూర్తి చేసుకున్న వారి వివరాలను నమోదు చేశారు. పునాది దశలో ఉండి అసలు బిల్లులు పడని ఇళ్ల నిర్మాణాలను ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద లబ్ధి చేకూర్చేందుకు సిద్ధం చేస్తున్నారు. వాటికి సంబంధించిన పరిశీలనలో భాగంగా లబ్ధిదారుల ఇంటి ప్రస్తుత పరిస్థితితోపాటు వారి బ్యాంకు ఖాతాల వివరాలు, ఆధార్, ఇతర పత్రాలను యాప్‌లో నమోదు చేశారు. దీని ప్రకారం వారికి త్వరలో నిధులు మంజూరు కానున్నాయి.

**అవనిగడ్డ నియోజకవర్గంలో ఇలా..**

| మండలం | లబ్ధిదారులు | బకాయిలు (రూ.లక్షల్లో) |
|---|---|---|
| నాగాయలంక | 451 | 98.18 |
| అవనిగడ్డ | 393 | 98.03 |
| కోడూరు | 566 | 131.17 |
| మోపిదేవి | 639 | 105.83 |
| చల్లపల్లి | 591 | 95.31 |
| ఘంటసాల | 429 | 80.25 |



పర్రచివర గ్రామంలో సర్వే చేస్తున్న గృహ నిర్మాణ అధికారి కార్తికేయ, సిబ్బంది (పాత చిత్రం)

**వివరాలు సేకరిస్తున్నాం**

గతంలో పనులు చేపట్టి వివిధ దశల్లో నిలిచిపోయిన గృహ నిర్మాణాలకు సంబంధించిన సమగ్ర వివరాలను యాప్‌లో నమోదు చేసి పంపిస్తున్నాం. ఎంత మేర చెల్లింపులు చేశారు? ఇంకా ఎంత బకాయిలున్నాయో తదితర విరాలు సేకరిస్తున్నాం. వాటికి సంబంధించిన బకాయి నిధులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమకానున్నాయి. **- కార్తికేయ, మండల గృహనిర్మాణాధికారి, నాగాయలంక**

**గుడివాడలో రూ.2.86 కోట్ల బకాయిలు**

గుడివాడ నియోజకవర్గంలో 2087 ఇళ్లకుగాను 682 మాత్రమే పూర్తయ్యాయి. 1405 ఇళ్లు వివిధ దశల్లో ఆగాయి. రూ.2,86,11,340 బకాయిలు చెల్లించాల్సి ఉంది.

**గుడివాడ నియోజకవర్గంలో ఇలా..**

| మండలం | ఇళ్లు | బకాయిలు (రూ.ల్లో) |
|---|---|---|
| గుడివాడ | 471 | 69,61,128 |
| గుడ్లవల్లేరు | 1088 | 1,41,76,858 |
| నందివాడ | 528 | 74,73,354 |

**పామర్రు నియోజకవర్గంలో..**

పామర్రు నియోజకవర్గంలో 3,011 గృహాలను పరిశీలించగా 749 పూర్తయ్యాయి. మిగిలిన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. మొత్తం రూ.33,17,62,415 మంజూరు కావాల్సి ఉండగా రూ.28,50,90,211 చెల్లించారు. ఇంకా రూ.4,66,72,204 బకాయిలు ఉన్నాయి.

## 44 గ్రామాల్లో నీటిని పరీక్షించాలని ఆదేశాలు

**గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే:** గుడివాడ నియోజకవర్గంలోని 44 గ్రామాల్లో తాగునీరు దారుణంగా ఉందని.. తక్షణం అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కంకిపాడులో సోమవారం నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమంలో విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర తాగునీరు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ముఖ్య ఇంజినీరు, ప్రాజక్టు డైరెక్టరు హరిరామ్ నాయక్ స్పందించారు. గ్రామీణ తాగునీటి విభాగం జిల్లా అధికారులు తక్షణం స్పందించి రెండు రోజుల్లో ఆయా గ్రామాల్లో తాగునీటి నమూనాలు సేకరించి నివేదిక సమర్పించాలన్నారు. వెంటనే ఫిల్టర్ బెడ్‌లు బాగు చేయాలని, అవసరమైన చోట కొత్తవి నిర్మించాలని సూచించారు.



ఎమ్మెల్యే రాము ఇచ్చిన నీళ్ల సీసా పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్ (పాత చిత్రం)

## కార్మికుల సమస్యలు పరిష్కరించండి

**గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే:** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సమస్యల్ని తెదేపా కూటమి ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఆ కార్మికుల సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు రేపాని కొండ కోరారు. స్థానిక గౌరీశంకరపురంలో సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక అందించాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. తాపీ కార్మికుల సంఘం అధ్యక్షుడు ఓలేటి సీతారామయ్య, మూడెడ్ల నారాయణ, తంబి, రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

**అవనిగడ్డ, న్యూస్‌టుడే:** భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల మానిఫెస్టోలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులు మంగళవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా నాయకులు వై.శ్రీనివాసరావు, ఎం.రామకృష్ణ, మండల అధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కాల్వలు యుద్ధప్రాతిపదికన బాగు చేయాలి

**తోట్లవల్లూరు, న్యూస్‌టుడే :** మురుగు కాల్వలు గుర్రపుడెక్కతో నిండిపోయాయని, భారీ వర్షాలు పడితే రైతులు తీవ్రంగా నష్టపోతారని, యుద్ధప్రాతిపదికన తొలగించాలని వైస్ ఎంపీపీ కళ్లం సాంబశివారెడ్డి డ్రెయినేజీ ఏఈ మణికంఠను నిలదీశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ రాజామణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కిందస్థాయి అధికారులను పంపడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాల్వ గట్టుపై పచ్చగడ్డికి పాటలు నిర్వహించి ఇరిగేషన్ అధికారులు ఆ డబ్బులు ఏం చేస్తున్నారని, కనీసం పిచ్చి మొక్కలకు మందు కూడా స్ప్రే చేయడం లేదని ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. బొడ్డపాడు ఎంపీయూపీ పాఠశాలలో ఆంగ్లం బోధించే ఉపాధ్యాయుడు మద్యం తాగొచ్చి పాఠాలు చెబుతున్నాడని ఎంఈవో 1 వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సర్పంచి మూడే శివశంకర్ అధికారులను నిలదీశారు. తహసీల్దార్ ఎం.కుసుమకుమారి, పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



డ్రెయినేజీ ఏఈని ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ సాంబశివారెడ్డి

## ఘనంగా వెంపటి జయంతి

**కూచిపూడి, న్యూస్‌టుడే:** కూచిపూడి నాట్యాచార్యులు పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం జయంతిని మంగళవారం కూచిపూడిలో ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, సిద్ధేంద్ర నాట్య కళాపీఠంలో వెంపటి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ఇంటి వద్ద గల స్మృతి సదనంలోని విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూల మాలలు వేశారు. విద్యార్థులు నాట్య ప్రదర్శనలతో నృత్యనీరాజనాలు అందించారు. మిఠాయిలు పంచారు. కళాపీఠం వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, సహాయ ఆచార్యులు డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, మృదంగ విద్వాంసులు పసుమర్తి హరనాథశాస్త్రి, సంగీతాచారిణి డాక్టర్ వేదాంతం వెంకటదుర్గాభవాని, లైబ్రేరియన్ ఏలేశ్వరపు ఫణికుమార్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



చినసత్యం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాట్యాచార్యులు, కళాకారులు

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**ఘంటసాల(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే:** గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఘంటసాల మండలంలోని 54 రహదారులను 5,335 మీటర్ల పొడవునా రూ.370.25 లక్షల వ్యయంతో సీసీ రహదారుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మంగళవారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పల్లెల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలుగా ఈనెల 21 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలి వెంకట్రామ్, తెదేపా మండల అధ్యక్షుడు టి.చౌదరిబాబు, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు జి.వెంకట రామకృష్ణ, సర్పంచి వెంకటేశ్వమ్మ, ఉప సర్పంచి భాను ప్రకాష్, తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఎంపీడీవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్లకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మండలి

**పల్లెబాట కొనసాగిస్తా : వర్ల**

**మేడూరు, హనుమంతపురం(పమిడిముక్కల), న్యూస్‌టుడే:** పల్లె పండగలో భాగంగా శాసనసభ్యుడు వర్ల కుమార్‌రాజా మేడూరులో రూ.46 లక్షలతో నిర్మించనున్న 5 సిమెంటు రహదారులకు మంగళవారం భూమి పూజచేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గతంలో మాదిరిగా పల్లెబాట, పల్లెనిద్ర కార్యక్రమం కొనసాగిస్తానని ఆయన ప్రకటించారు. గ్రామస్థుల అభ్యర్థనపై ధూళిపూడిపాలెంలో రెండు సీసీ రహదారుల నిర్మాణానికి అదనంగా నిధులు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచి గొర్కిపూడి స్వర్ణలత, తెదేపా నాయకులు గుళ్లపల్లి సురేష్, యలమంచి సాయికృష్ణ, గూడపాటి బుచ్చిబాబు, ఎంపీడీవో విలల్‌పాల్, పీఆర్ ఏఈ పృథ్వీరాజ్ పాల్గొన్నారు.



★ **హనుమంతపురంలో** రూ.30.5 లక్షలతో 5 రహదారుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కుమార్‌రాజా భూమిపూజ చేశారు. తెదేపా నాయకులు లింగమనేని బాబూరావు, వెంట్రప్రగడ పిచ్చేశ్వరరావు, పరుచూరి వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

★ పామర్రు నియోజకవర్గ తెదేపా బాధ్యునిగా పదవి చేపట్టి మూడేళ్లు నిండిన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పమిడిముక్కలలో మంగళవారం ఎమ్మెల్యే వర్లకు అభినందన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కేకు కోసి మిఠాయిలు పంచారు. నాయకులు మైనేని నరేంద్ర, నాదెళ్ల సుబ్రహ్మణ్యం, జక్కా శ్రీనివాసరావు, ఎ.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

**నెమ్మలూరులో..**

**పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే:** నెమ్మలూరు, ప్రాకెర్ల, ఎలకుర్రు, కొరిమెర్ల గ్రామాల్లో మంగళవరం పల్లె పండగ వారోత్సవాలు నిర్వహించారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ పాల్గొని పనులు ప్రారంభించగా ఎంపీడీవో జ్యోతి మాట్లాడుతూ ఎలకుర్రు పంచాయతీ పరిధిలో మూడు రోడ్లకు రూ.17.50 లక్షలు మంజూరయ్యాయన్నారు. నెమ్మలూరులో రూ.12 లక్షలతో 170 మీటర్ల పొడవున మూడు రోడ్లు, ప్రాకెర్ల పంచాయతీలో రూ.12.70 లక్షలతో రెండు రోడ్లు, కొరిమెర్లలో రూ.10 లక్షలతో ఒక రోడ్డు నిర్మిస్తున్నామన్నారు.

## హామీలు నెరవేర్చేందుకు ఎమ్మెల్యే రాము కృషి

**గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే:** నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శేరీ దింటకుర్రు, నూజెళ్ల గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.20 లక్షలతో సీసీరోడ్ల పనులకు రావి భూమి పూజ చేశారు. జనసేన, భాజపా నియోజకవర్గ బాధ్యులు బూరగడ్డ శ్రీకాంత్, దావులూరి సురేంద్రబాబు, తెదేపా నాయకుడు గోర్జి సత్యనారాయణ, కొడాలి రామరాజు, వాసే మురళి, ఎంపీడీవో బి.వై.విష్ణు ప్రసాద్, డీఈ బి.రవి, ఏఈ వి.సూరిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పల్లె పండగలో మాజీ ఎమ్మెల్యే రావి తదితరులు

## అభ్యసన వైకల్యం నివారణపై అవగాహన

**కపిలేశ్వరపురం(పమిడిముక్కల), న్యూస్‌టుడే:** డిస్లెక్సియా రుగ్మత ఉన్న బాలలు చదవడం, రాయడం, చెప్పింది అర్థం చేసుకోవడంలో వెనకంజలో ఉంటారని.. అలాంటి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంద్వారా ఆ లోపాన్ని అధిగమించవచ్చని కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ప్రభాకరరావు తెలిపారు. డిస్లెక్సియా నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం భవిత కేంద్రంలో బాలల్లో వచ్చే ఈ లోపంపై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు రజినీకుమార్, ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.వర్ధనమ్మ పాల్గొన్నారు.

**పెదపారుపూడి, న్యూస్‌టుడే:** ఎంఈవో బి.శ్రీనివాసరావు ప్రత్యేక అవసరాల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం వాక్‌థాన్ నిర్వహించారు. ఎంఈవో -2 వి.సురేష్, హెచ్ఎం భవాని, ఐ.ఇ.ఆర్.టి. హరిబాబు, సి.ఆర్.పి.లు పాల్గొన్నారు.

**పామర్రు, న్యూస్‌టుడే:** స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఎంఈవో -2 పద్మవాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధానోపాధ్యాయిని ఆలపాటి ఇందిరారాణి తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు





అవనిగడ్డ గ్రామీణం: శ్రీకాకుళంలో

**తోట్లవల్లూరు, న్యూస్‌టుడే :** స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు టి.ఫణిరాజామోహన్ అవగాహన కల్పించారు. శ్రీనివాస్, లక్ష్మణ్, నిరుపమ, శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**అవనిగడ్డ, కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే:** చదువుకునే విద్యార్థుల్లో అభ్యసన వైకల్యాలు సర్వసాధారణమని ఎంఈవో 2 అన్నపరెడ్డి పిచ్చయ్య అన్నారు. అవనిగడ్డ, కోడూరు మండల భవిత కేంద్రాల వద్ద మంగళవారం పిల్లల్లో అభ్యసన వైకల్యాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అవనిగడ్డ భవిత కేంద్రం ఐఈడీఎస్ఎస్. సుబ్బారావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కోడూరులో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో 2 వి.శ్రీనివాసరావు, ఐఈఆర్టీ రంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

**ఘంటసాల(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే:** శ్రీకాకుళంలోని జడ్పీపాఠశాలలో ఎంఈవో ఎన్.శివశంకరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన జరిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎ.భువనేశ్వరి, ఐఈఆర్పీ శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం

**అవనిగడ్డ, న్యూస్‌టుడే:** గొప్ప క్షిపణి శాస్త్రవేత్త మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక గాంధీక్షేత్రంలో మంగళవారం నిర్వహించిన కలాం జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని కలామ్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. మండలి వెంకట్రామ్, లలితకళా సమితి కార్యదర్శి కె.చంద్రశేఖర్, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి కె.వెంకటేశ్వరరావు, తెదేపా మండల అధ్యక్షుడు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

**ఘంటసాల(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే:** శ్రీకాకుళం గ్రంథాలయంలో కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఉప సర్పంచి శీలం శ్రీను కలామ్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. గ్రంథాలయాధికారిణి డి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

**పెదమద్దాలి(పామర్రు గ్రామీణం), న్యూస్‌టుడే:** మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం ఆశయ సాధనకు నేటి యువత నడుంబిగించాలని పంచాయతీ కార్యదర్శి పాగోలు పూర్ణచంద్రరావు అన్నారు. పెదమద్దాలిలో రైతు బిడ్డ డొక్కు కోటయ్య సుబ్రహ్మణ్యేశ్వరరావు అభినందన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. అనంతరం నాలుగు పాఠశాలలకు చెందిన 110 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని లక్ష్మీ కుమారి, ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.నజీర్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



అవనిగడ్డ: కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



పామర్రు గ్రామీణం: పెదమద్దాలిలో...



## సాయిబాబా మృతికి కారకులను శిక్షించాలి

**చల్లపల్లి, న్యూస్‌టుడే:** పౌరహక్కుల ఉద్యమనేత, డిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబాది ముమ్మాటికీ సర్కారు హత్య అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. ఇటీవల మృతిచెందిన ప్రొఫెసర్ సాయిబాబాకు చల్లపల్లిలోని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ 90శాతం వైకల్యంతో ఉన్న ప్రొఫెసర్ సాయిబాబాను పదేళ్లపాటు అక్రమంగా నిర్బంధించి హింసించడం కక్షపూరిత ధోరణేనని అన్నారు. సీపీఐ నాయకులు నక్కా శ్రీనివాసరావు, నాగమల్లి, ప్రజాసంఘాల నేతలు మీర్‌రిజ్వాన్, భాస్కరరావు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న సీపీఐ, ప్రజా సంఘాల నేతలు

## మద్యం దుకాణానికి అనుమతులివ్వొద్దు

**ఘంటసాల(అవనిగడ్డ గ్రామీణం),న్యూస్‌టుడే:** నివాసాలు, దేవాలయాలు, కోచింగ్ సెంటరు ఉన్న ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వవద్దంటూ ఘంటసాలలోని మార్కెట్ వెనుక ప్రాంత ప్రజలు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ప్రతాప రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. తాము ఉండే ప్రాంతానికి దుకాణం ఏర్పాటుకు 100మీటర్ల దూరంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, పోలేరమ్మ ఆలయం, చర్చి, కోచింగ్ సెంటర్ ఉన్నట్లుగా వారు వినతిలో పేర్కొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

**మోపిదేవి, న్యూస్‌టుడే:** మోపిదేవి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, ప్లస్ టూ విద్యార్థులు మంగళవారం పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తాజా ఆదేశాలతో హైస్కూల్ ప్లస్ టూ విద్యార్థులకు ఈ ఏడాది ప్రాజెక్టులో భాగంగా అవగాహన కోసం పోలీస్ స్టేషన్ సందర్శన కార్యక్రమాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ఎస్సై వీర వెంకట సత్యనారాయణ వివరాలు అందించారు. పోలీస్ వ్యవస్థ ఏర్పాటు, శాంతిభద్రతల పర్యవేక్షణ, అల్లర్లు, మతపరమైన గొడవలు, మంత్రుల పర్యటన సందర్భంలో బందోబస్తు నిర్వహించే విధానం, తదితర అంశాలపై అవగాహన చేశారు. ఉపాధ్యాయులు ఫణికుమార్, నరేష్‌బాబు, ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.